




ఆర్ఎన్ఐ/2009/ 28733 స్థాపితం : 2003

# ఆంధ్రనాడు

తెలుగు దినపత్రిక

సంపుటి : 22 సంచిక: 55 తిరుపతి తేది : బుధవారం 27 మే 2026 పేజీలు : 08 ధర : రూ.6 PUBLISHED FROM TIRUPATI, CHITTOOR, ANNAMAIAH, ANANTHAPUR DISRICTS




## ప్రధాని మోదీతో కేరళ నూతన సీఎం సతీశన్ తొలి భేటీ

- రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సాయం కోరుతూ వినతిపత్రం
- ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇదే తొలి సమావేశం
- కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అమిత్ షాతోనూ భేటీకి ప్రణాళిక
- కేంద్రంతో సత్సంబంధాల దిశగా యూడీఎఫ్ సర్కార్ తొలి అడుగు

న్యూఢిల్లీ – ఆంధ్రనాడు, మే 26

కేరళ నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వి.డి. సతీశన్ నేడు ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో తొలిసారి సమావేశమయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి ఘన విజయం సాధించిన తర్వాత కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు నెలకొల్పుకునే దిశగా

- మిగతా 2లో..

# మోదీ సర్కార్‌కు 12 ఏళ్లు..

- 'విజయాల' ప్రచారానికి బీజేపీ భారీ ప్రణాళిక
- కేంద్రంలో మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంకు 12 ఏళ్లు పూర్తి
- దేశవ్యాప్తంగా '22 విజయాలు' ప్రచారం చేసేందుకు బీజేపీ ప్రణాళిక
- ఇది సుపరిపాలన, అభివృద్ధి ప్రస్థానంగా అభివర్ణించిన కమలదళం
- 'విధానాల పక్షవాతం' నుంచి దేశం బయటపడిందని కేంద్ర మంత్రుల వ్యాఖ్య
- వికసిత భారత్ లక్ష్యానికి ఈ 12 ఏళ్ల పాలనే పునాది అని స్పష్టీకరణ



న్యూఢిల్లీ – ఆంధ్రనాడు, మే 26

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నిన్నటితో 12 సంవత్సరాలు పూర్తయింది. ఈ దశాబ్ద కాలానికి పైబడిన ప్రస్థానాన్ని సుపరిపాలన, అభివృద్ధి, జాతీయ పరివర్తనకు చిరునామాగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభివర్ణించింది. ఈ మైలురాయిని పురస్కరించుకుని, దేశవ్యాప్తంగా భారీ ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తమ ప్రభుత్వం సాధించిన '22 ముఖ్యమైన విజయాలను' ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు కేంద్ర మంత్రులు, బీజేపీ

- మిగతా 2లో..

# నేటి నుంచి టీడీపీ మహానాడు

- సర్వం సిద్ధం : పల్లా శ్రీనివాసరావు
- ఈసారి భౌతికంగా కాకుండా హైబ్రిడ్ పద్ధతిలో డిజిటల్ వేదికగా ఏర్పాటు
- మంగళగిరి కేంద్ర కార్యాలయం నుంచి 1,848 క్లస్టర్లకు అనుసంధానం
- 'స్త్రీశక్తి' ప్రధాన ఇతివృత్తంగా జరగనున్న ఈ ఏడాది మహానాడు
- ప్రధాని మోదీ పిలుపు మేరకు ఖర్చులు తగ్గించి, నిధులు పార్టీకి వినియోగం




అమరావతి – ఆంధ్రనాడు, మే 26

తెలుగుదేశం పార్టీ ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'మహానాడు' కార్యక్రమం ఈసారి సరికొత్త రూపంలో జరగనుంది. దేశ రాజకీయాల్లోనే ఒక వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుడుతూ, మే 27, 28 తేదీల్లో 'హైబ్రిడ్ మహానాడు' నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రకటించారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్ కేంద్ర కార్యాలయం వేదికగా జరగనున్న ఈ కార్యక్రమాన్ని, రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 1,848 క్లస్టర్లకు డిజిటల్ సాంకేతికత ద్వారా అనుసంధానించి, లక్షలాది మంది కార్యకర్తలను భాగస్వాములను చేయనున్నారు. 'స్త్రీశక్తి'ని ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని ఈ మహానాడు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

**ప్రధాని పిలుపుతో ప్రణాళికలో మార్పు**

వాస్తవానికి ఈ

- మిగతా 2లో..

# రైతుల ముంగిటకే మార్కెట్..

- 'ఫార్మ్ టు హోమ్' విధానానికి చంద్రబాబు శ్రీకారం
- రైతు ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేర్చే 'ఫార్మ్ టు హోమ్' విధానం
- యడవోలు వద్ద కోకో సిటీ ఏర్పాటుకు పరిశీలన
- జూలైలో అగ్రికల్చర్ స్కూల్‌కు శంకుస్థాపన
- రైతు బజార్లలో ప్రకృతి సేద్య ఉత్పత్తులకు ప్రత్యేక కౌంటర్లు



అమరావతి – ఆంధ్రనాడు, మే 26

రాష్ట్ర వ్యవసాయ రంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రైతులు పండించిన పంటలను, ముఖ్యంగా కూరగాయలు, పండ్లను నేరుగా వినియోగదారుల ఇళ్లకే చేర్చేందుకు 'ఫార్మ్ టు హోమ్' విధానాన్ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్పీఓ) ద్వారా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధర, వినియోగదారులకు తక్కువ ధరకే నాణ్యమైన ఉత్పత్తులు అందుతాయని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు

- మిగతా 2లో..



## ఏపీ ఎడ్‌సెట్-2026 ఫలితాలు విడుదల

- ఫలితాలను ప్రకటించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్
- ఈ ఏడాది 99.30 శాతం ఉత్తీర్ణత నమోదు
- పరీక్షకు హాజరైన 19,880 మందిలో 19,741 మంది అర్హత
- అధికారిక వెబ్‌సైట్, వాట్సాప్‌లోనూ ఫలితాలు అందుబాటులో

అమరావతి – ఆంధ్రనాడు, మే 26

ఆంధ్రప్రదేశ్‌లో బీఎడ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఎడ్‌సెట్)–2026 ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి

- మిగతా 2లో..

# పుణ్యం మాట దేవుడెరుగు.. రోగాలు మాత్రం కచ్చితం..

- రాజమండ్రిలో పుష్కర ఏర్పాట్లను పరిశీలించిన పవన్‌కల్యాణ్
- గోదావరిలో కాలుష్య పరిస్థితిపై స్వయంగా తనిఖీలు
- ఆంధ్ర పేపర్ మిల్స్ వ్యర్థాలు నదిలో కలిసే ప్రాంతానికి బోటులో వెళ్లిన పవన్

రాజమండ్రి – ఆంధ్రనాడు, మే 26



రాజమండ్రిలో గోదావరి పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రెండో రోజు కూడా క్షేత్రస్థాయిలో కాలుష్య పరిస్థితిపై తనిఖీలు చేపట్టారు. వెంకటనగరం సమీపంలోని ఆంధ్ర పేపర్ మిల్స్ నుంచి పారిశ్రామిక వ్యర్థాలు నదిలో కలిసే ప్రాంతాన్ని ఆయన బోటులో వెళ్లి స్వయంగా పరిశీలించారు. అక్కడ అధికారులతో నీటి నమూనాలను (శాంపిల్స్) సేకరింపజేశారు. ఈ సందర్భంగా పవన్ తో పాటు మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. "పవిత్ర గోదావరిలో పారిశ్రామిక వ్యర్థాలు కలవడం దారుణం. పుష్కరాల వేళ ఈ నీటిలో స్నానం చేస్తే పుణ్యం మాట దేవుడెరుగు... రోగాలు మాత్రం కచ్చితంగా వస్తాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఏలూరులో తాగునీటి కాలుష్యం

- మిగతా 2లో..

# జనాలు నవ్వుకుంటున్నా 'మావిగన్'ను పట్టుకుని వేలాడుతున్నారు

- అమరావతి నిర్మాణ వ్యయాలపై వైసీపీ నేతలు తప్పుడు లెక్కలు చెబుతున్నారన్న నారాయణ
- 30,079 మంది రైతులకు ఇప్పటికే ప్లాటు కేటాయించామని వెల్లడి
- అమరావతి ద్వారా ఏటా రూ. 12 వేల కోట్ల ఆదాయం వస్తుందన్న మంత్రి

అమరావతి– ఆంధ్రనాడు, మే 26



రాజధాని అమరావతి నిర్మాణంపై వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలపై మంత్రి నారాయణ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అమరావతి పరిధిలో శరవేగంగా జరుగుతున్న అసెంబ్లీ, హైకోర్టు, ఐకానిక్ టవర్స్, అధికారుల నివాస భవనాల నిర్మాణ పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణ సచివాలయం, అసెంబ్లీ

- మిగతా 2లో..

## ప్రధాని మోదీతో కేరళ నూతన
# సీఎం సతీశన్ తొలి భేటీ

(మొదటిపేజీ తరువాయి)

ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ప్రధాని కార్యాలయంలో సుమారు 20 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరుతూ సీఎం సతీశన్.. ప్రధానికి ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సమావేశంలో కేరళ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ. జయతిలక్ కూడా పాల్గొన్నారు. దశాబ్ద కాలం పాటు అధికారంలో ఉన్న పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్‌ను ఓడించి యూడీఎఫ్ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే ఈ భేటీ జరగడం రాజకీయంగా ఆసక్తి రేపింది. మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక సహాయం, పెండింగ్‌లో ఉన్న రైల్వే, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వంటి అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. అయితే, భేటీ అనంతరం బయటకు వచ్చిన సతీశన్.. చర్చల వివరాలను వెల్లడించలేదు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఢిల్లీ వచ్చిన ఆయన, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, హోంమంత్రి అమిత్ షా, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లతో కూడా సమావేశం కానున్నారు.

# రైతుల ముంగిటకే మార్కెట్..

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ.. ఈ ఏడాది రాష్ట్రంపై ఎల్ నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి, ప్రాంతాల వారీగా పంటల ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. ప్రతికూల వాతావరణంలోనూ రైతులు నష్టపోకుండా కనీస మద్దతు ధర కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా తీసుకోవాలన్నారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాలని, ఈ విధానంలో విజయం సాధించిన రైతుల అనుభవాలను వినియోగించుకోవాలని తెలిపారు. భూసార పరీక్షలు నిర్వహించి, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో రైతులకు అందుబాటులో ఉంచాలని, రైతు బజార్లలో ప్రకృతి సేద్య ఉత్పత్తులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నీటి కొరత ఉన్నచోట్ల పీఎండీఎస్-హాఫ్ మూన్ పద్ధతుల్లో సేద్యం చేపట్టాలన్నారు.

**ప్రాంతీయ అభివృద్ధికి భారీ ప్రణాళికలు**

రాయలసీమను ఉద్యానవన హబ్‌గా మార్చేందుకు రూ.40 వేల కోట్లతో 'పూర్వోదయ' పథకం కింద సాగునీటి ప్రాజెక్టులు, రహదారులు, గోదాముల వంటి మౌలిక వసతులు కల్పించనున్నట్టు సీఎం వివరించారు. దీనికి తోడు రూ.60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం యడవోలు వద్ద 'కోకో సిటీ' ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని సూచించారు. అలాగే, జూలై నాటికి మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన చేయనున్నట్టు వెల్లడించారు. పులివెందులలో సెంట్రల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీ నిర్మాణాన్ని పూర్తి చేసి, వినియోగంలోకి తెచ్చేందుకు తక్షణమే రూ.3 కోట్లు విడుదల చేయాలని ఆదేశించారు. రాయలసీమలో పండే అరటికి ప్రత్యేకంగా కోల్డ్ స్టోరేజ్ సౌకర్యం కల్పించాలని కూడా అధికారులను ఆదేశించారు. వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు క్లస్టర్ల వారీగా ప్రణాళికలు రూపొందించి, రైతు సాధికార సంస్థ ద్వారా హార్వెస్టర్లు, ఇతర యంత్ర పరికరాలు అందించాలని తెలిపారు.

# ఏపీ ఎడ్‌సెట్-2026 ఫలితాలు విడుదల

(మొదటిపేజీ తరువాయి)

నారా లోకేష్ మంగళవారం ఈ ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. ఈ ఏడాది ఎడ్‌సెట్‌లో రికార్డు స్థాయిలో 99.30 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఆయన వెల్లడించారు. ఈ ఏడాది ఎడ్‌సెట్ పరీక్షకు మొత్తం 19,880 మంది అభ్యర్థులు హాజరు కాగా, వారిలో 19,741 మంది అర్హత సాధించినట్లు మంత్రి లోకేష్ తన ప్రకటనలో తెలిపారు. అద్భుతమైన ప్రతిభ కనబరిచి, అర్హత సాధించిన అభ్యర్థులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో ఉత్తమ ఉపాధ్యాయులుగా రాణించాలని ఆకాంక్షించారు. అభ్యర్థులు తమ ర్యాంక్ కార్డులను అధికారిక వెబ్‌సైట్ cets.apsche.ap.gov.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అదనంగా, 9552300009 అనే వాట్సాప్ నంబర్ ద్వారా కూడా ఫలితాలను సులభంగా తెలుసుకునే సదుపాయాన్ని కల్పించారు. ఎడ్‌సెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు తదుపరి కౌన్సెలింగ్‌కు హాజరై, రాష్ట్రంలోని వివిధ కళాశాలల్లో బీఎడ్ కోర్సుల్లో ప్రవేశాలు పొందుతారు.

# పుణ్యం మాట దేవుడెరుగు.. రోగాలు మాత్రం కచ్చితం..

(మొదటిపేజీ తరువాయి)

కారణంగా జరిగిన ప్రమాదాలను గుర్తు చేస్తూ, రాష్ట్ర ప్రగతికి పరిశ్రమలు ఎంత అవసరమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. ఈ కాలుష్య సమస్యపై త్వరలోనే అసెంబ్లీ, కేబినెట్ సమావేశాల్లో చర్చిస్తామన్నారు. పుష్కరాల రేవులను కేవలం అందంగా తీర్చిదిద్దడమే కాదు, నది కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత కూడా ఉందని మంత్రి కందుల దుర్గేష్‌ను ఉద్దేశించి పవన్ అన్నారు. పేపర్ మిల్స్ కాలుష్యంపై తాము నిఘా ఉంచామని, అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు.

## జనాలు నవ్వుకుంటున్నా 'మావిగన్'ను పట్టుకుని వేలాడుతున్నారు

(మొదటిపేజీ తరువాయి)

నిర్మాణ వ్యయాలపై వైసీపీ నేతలు తప్పుడు లెక్కలు చెబుతూ ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాగే మాట్లాడితే గత ఎన్నికల్లో వచ్చిన 11 సీట్లు కూడా భవిష్యత్తులో సున్నా అవ్వడం ఖాయమని హెచ్చరించారు. జనాలు నవ్వుకుంటున్నా 'మావిగన్'ను పట్టుకుని వేలాడుతున్నారని ఎద్దేవా చేశారు. అమరావతి కోసం 30,760 మంది రైతులు 35,059 ఎకరాల భూమిని ఇచ్చారని, వారిలో 30,079 మందికి ఇప్పటికే ప్లాట్లు కేటాయించామని మంత్రి తెలిపారు. ఆల్ ఇండియా సర్వీస్ అధికారుల కోసం నిర్మిస్తున్న నివాస భవనాలను జూన్ నెల నుండి దశలవారీగా జీఏడీకి అప్పగిస్తామన్నారు. ఖర్చుల వివరాలను వెల్లడిస్తూ.. హైదరాబాద్ సచివాలయానికి చదరపు అడుగుకు రూ.13,768, కొత్త పార్లమెంట్‌కు రూ.16,916 వ్యయం అవ్వగా, అమరావతి ఐకానిక్ టవర్స్‌కు రూ.15,000 నుండి రూ.16,000 వరకు ఖర్చవుతుందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో అమరావతి ద్వారా ఏటా రూ.12 వేల కోట్ల ఆదాయం వస్తుందని, ఇక్కడి మిగులు భూములతోనే తీసుకున్న రుణాలను తీర్చగలమని మంత్రి నారాయణ ధీమా వ్యక్తం చేశారు.

# మోదీ సర్కార్‌కు 12 ఏళ్లు..

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రులు, ఎంపీలు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ 12 ఏళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల విస్తరణ, ఆర్థిక సంస్కరణలు, డిజిటల్ పాలన, విదేశాంగ విధానంలో సాధించిన విజయాలు, సామాజిక రంగంలో చేపట్టిన కార్యక్రమాలను ఈ ప్రచారం ద్వారా ప్రజలకు వివరించనున్నారు.

**'సంకల్పం నుంచి సాఫల్యం' యాత్రగా అభివర్ణించిన నితిన్ నబిన్**

ఈ సందర్భంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ 12 ఏళ్ల ప్రస్థానాన్ని 'సంకల్పం నుంచి సాఫల్యం వరకు' సాగిన యాత్రగా అభివర్ణించారు. "2014 మే 26న ప్రారంభమైన ఈ శకం కేవలం ప్రభుత్వ మార్పు కాదు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం తిరిగి పొందిన ఆత్మవిశ్వాసం, సాంస్కృతిక పునరుజ్జీవనానికి చారిత్రక ఘట్టం" అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్' అనే మంత్రంతో పాటు అంత్యోదయ స్ఫూర్తితో ప్రభుత్వం పాలన సాగించిందని, సామాన్యుడి జీవితంలో మార్పు తెచ్చిందని అన్నారు. 'వికాస్ భీ, విరాసత్ భీ' (అభివృద్ధి, వారసత్వం) రెండింటినీ సమతుల్యం చేశారని, ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపడం ద్వారా దేశం ఇప్పుడు మరింత సురక్షితంగా ఉందని తెలిపారు. 2047 నాటికి 'వికసిత భారత్' నిర్మాణానికి ఈ 12 ఏళ్ల పాలనే బలమైన పునాది అని ఆయన పేర్కొన్నారు.

**మోదీ ఒక నిజమైన 'ప్రధాన్-సేవక్': రాజ్‌నాథ్ సింగ్**

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందిస్తూ.. 2014 మే 26న భారతదేశ అభివృద్ధి, నాగరిక ప్రస్థానంలో ఒక నూతన అధ్యాయం ప్రారంభమైందని అన్నారు. "ఆర్థికాభివృద్ధి, సామాజిక సంక్షేమం నుంచి ఆత్మనిర్భర్ భారత్, డిజిటల్ పరివర్తన వరకు, మౌలిక సదుపాయాల నుంచి బలమైన జాతీయ భద్రత వరకు ప్రతి రంగంలోనూ దేశం అపూర్వమైన వేగంతో పురోగమించింది" అని ఆయన వ్యాఖ్యానించారు. దేశ వృద్ధి ఇప్పుడు మరింత విస్తృతమైనదిగా, సమ్మిళితమైనదిగా మారిందన్నారు. దశాబ్దాలుగా తెరమరుగైన కోట్లాది మంది ప్రజలు దేశాభివృద్ధిలో భాగస్వాములయ్యారని, మోదీ ఒక నిజమైన 'ప్రధాన్-సేవక్' అని కొనియాడారు.

**ప్రజా సంక్షేమానికి ఒక 'స్వర్ణయుగం': శివరాజ్ సింగ్ చౌహాన్**

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. గడిచిన 12 ఏళ్లు సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమానికి అంకితమైనవని అన్నారు. ఒకప్పుడు దేశం ఎదుర్కొన్న 'విధానాల పక్షవాతం' నుంచి బయటపడి 'సంస్కరణ, పనితీరు, పరివర్తన' మంత్రంతో ముందుకు సాగుతోందని చెప్పారు. ఈ కాలాన్ని భారతదేశ పునర్నిర్మాణానికి, ప్రజా సంక్షేమానికి ఒక 'స్వర్ణయుగం'గా అభివ ర్ణించారు. జన్ ధన్ ఖాతాల నుంచి ఆయుష్మాన్ భారత్ వరకు, పీఎం ఆవాస్ యోజన నుంచి డిజిటల్ ఇండియా వరకు ఎన్నో పథకాలతో ప్రధాని మోదీ అభివృద్ధి, సంక్షేమాలలో కొత్త అధ్యాయాన్ని లిఖించారని ప్రశంసించారు.

# నేటి నుంచి టీడీపీ మహానాడు

(మొదటిపేజీ తరువాయి)

ఏడాది మహానాడును నెల్లూరులో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించాలని టీడీపీ మొదట ప్రణాళిక రచించింది. అయితే, పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో దేశ పౌరులు ఖర్చులు తగ్గించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును స్ఫూర్తిగా తీసుకున్నట్లు పల్లా శ్రీనివాస రావు వివరించారు. దేశ యోగక్షేమాలను దృష్టిలో ఉంచుకుని, భారీ ఖర్చుతో కూడిన భౌతిక కార్యక్రమాన్ని రద్దు చేసుకుని, హైబ్రిడ్ విధానంలో నిర్వహించాలని పార్టీ నిర్ణయించిందని ఆయన పేర్కొన్నారు. ఈ మార్పు ద్వారా ఆదా అయిన నిధులను పార్టీ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తామని తెలిపారు. ఈ నిర్ణయం దేశం కోసం టీడీపీ వేస్తున్న డిజిటల్ అడుగులకు నిదర్శనమని ఆయన అభివర్ణించారు.

**లోకేష్ మార్క్.. డిజిటల్ విప్లవం**

ఈ హైబ్రిడ్ మహానాడు ఆలోచన వెనుక పార్టీ యువ నాయకుడు, హార్వర్డ్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి నారా లోకేష్ దార్శనికత ఉందని పల్లా తెలిపారు. ఆయన అనుభవం, సాంకేతిక పరిజ్ఞానంతో తెలుగుదేశం పార్టీని డిజిటల్ యుగంలోకి నడిపిస్తున్నారని కొనియాడారు. సుమారు రెండు వేల క్లస్టర్ల ద్వారా లక్షలాది మంది కార్యకర్తలను ఏకకాలంలో అనుసంధానించడం ఒక ప్రాంతీయ పార్టీకి రికార్డు అని, ఇది దేశ చరిత్రలోనే ఒక విప్లవాత్మక ఘట్టంగా నిలిచిపోతుందని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ నిర్వహించనున్న ఈ హైబ్రిడ్ మహానాడుపై ఇతర రాజకీయ పార్టీల్లోనూ తీవ్ర ఆసక్తి నెలకొందని ఆయన వ్యాఖ్యానించారు.

**హైబ్రిడ్ మహానాడు ఇలా..**

మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో చంద్రబాబు, నారా లోకేష్ సహా ముఖ్య నేతలు పరిమిత సంఖ్యలో భౌతికంగా పాల్గొంటారు. రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 1,848 క్లస్టర్ల వద్ద భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి, కేంద్ర కార్యాలయంలో జరిగే కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. ప్రతి క్లస్టర్ నుంచి ఎంపిక చేసిన కార్యకర్తలు, నేతలు నేరుగా చంద్రబాబు, లోకేష్‌లతో మాట్లాడే అవకాశం కల్పిస్తారు. దీనివల్ల ప్రతి కార్యకర్త నేరుగా మహానాడులో పాల్గొన్న అనుభూతి పొందుతాడని పార్టీ భావిస్తోంది. గతంలో వేలాది మంది మాత్రమే పాల్గొనే అవకాశం ఉండగా, ఈసారి లక్షలాది మందికి మహానాడు చేరువ కానుంది.

**స్త్రీశక్తి, ఇతర అంశాలపై చర్చ**

ఈ ఏడాది మహానాడులో 'స్త్రీశక్తి' ప్రధాన అంశంగా ఉండనుంది. మహిళా సంక్షేమం కోసం టీడీపీ గతంలో చేసిన కృషి, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించనున్నారు.

దీంతో పాటు 'కాక్రోచ్ జనతాపార్టీ' వంటి రాజకీయ అంశాలు, ఆరోగ్యకరమైన సోషల్ మీడియా వినియోగాన్ని ప్రోత్సహించడం వంటి అంశాలపై కూడా చర్చలు, తీర్మానాలు ఉంటాయని పల్లా శ్రీనివాస రావు తెలిపారు.

**సర్వం సిద్ధం.. కట్టుదిట్టమైన ఏర్పాట్లు**

ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మహానాడు కార్యక్రమాలు జరుగుతాయి. ప్రతి క్లస్టర్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించి, 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ' గీతాలాపనతో కార్యక్రమాలు ప్రారంభిస్తారు.

సాంకేతిక సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని, గత 10 రోజులుగా తాను కేంద్ర కార్యాలయం నుంచే ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నానని పల్లా వివరించారు. కార్యకర్తలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, తెలుగు జాతి గర్వించే ఈ పసుపు పండుగను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# మోదీపై శివరాజ్ సింగ్ చౌహాన్ పుస్తకం..

- ఢిల్లీలో ఆవిష్కరణకు హాజరైన మంత్రి లోకేష్
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పుస్తకావిష్కరణ
- ప్రధాని మోదీతో తన అనుభవాలపై 'అప్నాపన్' పేరుతో రచన
- ఢిల్లీలో జరిగిన ఈ వేడుకకు హాజరైన ఏపీ మంత్రి నారా లోకేష్
- మాజీ ప్రధాని దేవెగౌడ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ఆవిష్కరణ
- కార్యక్రమంలో పలువురు జాతీయ నేతలను కలిసిన లోకేశ్



**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం**

కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రచించిన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీతో తనకున్న వ్యక్తిగత అనుబంధం, అనుభవాల గురించి వివరిస్తూ చౌహాన్ 'అప్నాపన్: మై ఎక్స్‌పీరియన్సెస్ విత్ నరేంద్ర మోదీ' పేరుతో ఈ పుస్తకాన్ని రాశారు. ఢిల్లీలోని పూసాలో ఉన్న ఐకార్ క్యాంపస్‌లో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ పుస్తకాన్ని మాజీ ప్రధాని హెచ్.డి. దేవెగౌడ, మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. ఈ వేడుకలో ఏపీ మంత్రి నారా లోకేష్ పాల్గొని పలువురు జాతీయ స్థాయి నేతలను కలిశారు. ఈ కార్యక్రమానికి ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలు, బీజేపీ సీనియర్ నేతలు, సాహితీవేత్తలు హాజరయ్యారు. ప్రధాని మోదీ నాయకత్వ లక్షణాలు, ఆయన వ్యక్తిత్వం, ప్రజలతో మమేకమయ్యే తీరును ఈ పుస్తకం చక్కగా వివరిస్తుందని వక్తలు ప్రశంసించారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షమైన టీడీపీ తరఫున లోకేష్ ఈ కార్యక్రమంలో పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది.







## నాణ్యమైన విద్య పాఠశాలలతోనే సాధ్యం

### - ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడిలోకి విద్యార్థులు



**చంద్రగిరి – ఆంధ్రనాడు, మే 26:** నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలలతోనే సాధ్యపడుతుందని మండల విద్యాశాఖ అధికారి భాస్కర్ బాబు అన్నారు."బడి పిలుస్తుంది" కార్యక్రమంలో భాగంగా చంద్రగిరి మండలంలోని,నారావారిపల్లి మోడల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు మంగళవారం తమ పాఠశాల పరిధిలోని ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉచితంగా అందిస్తున్నటువంటి సౌకర్యాలు గురించి క్షుణ్ణంగా విద్యార్థుల తల్లిదండ్రులకు గ్రామస్తులకు తెలియజేసారు.ప్రభుత్వం పాఠశాలలలో కార్పొరేట్ స్థాయి మౌలిక వస్తువులను కల్పిస్తున్నదని చెప్పారు. ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులకు ఆధునిక విద్యా బోధన పట్ల వృత్యాంతర శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం లో వివిధ రకాల పౌష్టికాహారాన్ని అందిస్తున్నదని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మోడల్ ప్రాథమిక పాఠశాల నారావారిపల్లి ప్రధానోపాధ్యాయులు హసీనా బేగం ఉపాధ్యాయులు శ్రీరాములు, రవి కిరణ్, వెంకటయ్య, పాకీజా, షాజహాన్ మరియు సి ఆర్ పి రమేష్, తల్లితండ్రులు పాల్గొన్నారు.

## రేణిగుంటలో భారీ వర్షం




**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 26 :** రేణిగుంట పట్టణంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో వడగండ్ల వాన కురిసింది. రేణిగుంటలో మంగళవారం సాయంత్రం వడగండ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా వాతావరణం మారిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు ప్రాంతాల్లో ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో పాటు వడగండ్లు పడటంతో రహదారులపై నీరు నిలిచిపోయాయి. భారీ వర్షం కారణంగా వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడగా, కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా కూడా అంతరాయం ఏర్పడింది. ఇటీవల మండుతున్న ఎండలతో ఉక్కపోతకు గురైన ప్రజలకు ఈ వర్షం కొంత ఉపశమనం కలిగించింది. వర్షంతో వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. రేణిగుంట రైల్వే స్టేషన్ ముఖద్వారంలో వర్షపు నీటితో జలమయమైంది.

## ఎబోలా వైరస్ తస్మాన్ జాగ్రత్త



**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 26 :** ఎబోలా వైరస్ తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేణిగుంట ప్రభుత్వ ఆరోగ్య శాఖ వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి హెచ్చరించారు. సౌత్ ఆఫ్రికా, ఉగాం డా, కాంగో వంటి దేశాల్లో ఎబోలా వైర స్ తీవ్రంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యం లో, తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం హై అలర్ట్ ప్రకటిం చింది. రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్ర యం ద్వారా విదేశీ ప్రయాణికుల రాకపో కలు కొనసాగుతుండటంతో, వైరస్ జిల్లాలోకి ప్రవేశించకుండా పటిష్ట చర్యలు చేపట్టి నట్లు రేణిగుంట వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి వెల్లడించారు.విమానాశ్రయంలో ప్రత్యే క నిఘా విదేశీ ప్రయాణికులపై నిఘా ఉంచేందుకు రేణిగుంట ఎయిర్పోర్ట్ అథా రిటీ తో వైద్యశాఖ అత్యవసర సమావేశం నిర్వహించింది. రాబోయే రెండు మూడు రోజు ల్లో విమానాశ్రయంలో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. ఎయిర్ పోర్ట్ లో వైరస్ లక్షణాలు ఉన్నట్లు గుర్తిస్తే, తక్షణమే వారిని తిరుపతి స్విమ్స్ ఐసోలేషన్ వా ర్డుకు తరలించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కోవిడ్ తరహాలోనే అనుమానితుల ను ంచి ముక్కు మరియు గొంతు నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపి స్తారు. వ్యాప్తి మరియు ప్రమాదం ఎబోలా వైరస్ బాధితుల శరీర ద్రవాలు, దగ్గు మరి యు తుమ్ముల తుంపర్ల ద్వారా ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుందని డాక్టర్ చక్రపాణి వివరించారు.

## పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్ భూపతి కుమార్తెకు సన్మానం



**నాగలాపురం – ఆంధ్రనాడు, మే 26:** తిరుపతి జిల్లాలో పోలీస్ శాఖలో పనిచేస్తున్న సిబ్బంది పిల్లల్లో పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి.అనిత ఇటీవల ప్రత్యేకంగా సన్మానించి ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ నేపథ్యంలో నాగలాపురం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ భూపతి కుమార్తె పూజ పదవ తరగతిలో 572 మార్కులు సాధించి ప్రత్యేక గుర్తింపు పొందింది. హోం మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్న సందర్భంగా మంగళవారం నాగలాపురం పోలీస్ స్టేషన్‌లో భూపతి కుటుంబ సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగలాపురం సబ్ ఇన్స్పెక్టర్ సునీల్ చేతుల మీదుగా పూజను, ఆమె కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించి అభినందించారు. పూజ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తూ పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## రెవెన్యూ అంశాలపై కలెక్టర్లకు స్పెషల్ సీఎస్ దిశానిర్దేశం

- 22-ఏ, వెబ్‌ల్యాండ్, రీ-సర్వే తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్
- రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్‌పై ప్రత్యేక దృష్టి
- తిరుపతి జిల్లా నుంచి పాల్గొన్న కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్



**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 26 :** రాష్ట్రంలో భూపరిపాలన, రెవెన్యూ వ్యవస్థకు సంబంధించిన కీలక అంశాల అమలుపై జిల్లా యంత్రాంగం మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ), రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (స్పెషల్ సీఎస్) జి. జయలక్ష్మి సూచించారు. మంగళవారం ఏపీ సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా 22–ఏ, వెబ్‌ల్యాండ్ సేవలు, పట్టాదారు పాస్‌బుక్స్ పంపిణీ, రీ–సర్వే, మాన్యువల్ రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్, ఐవిఆర్ఎస్ తదితర అంశాల అమలు పురోగతిని సమీక్షించారు. ముఖ్యంగా రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తిరుపతి జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అలాగే జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భరత్ నాయక్, రోజ్ మాండ్, ల్యాండ్ అండ్ సర్వే అధికారి అరుణ్ కుమార్ తోపాటు రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## జనగణనకు తొలి ప్రాధాన్యం

- తహసీల్దార్లు, ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు సమన్వయంతో పనిచేయాలి
- నెలాఖరులోపు ప్రక్రియ పూర్తికి అధికారులకు కలెక్టర్ ఆదేశాలు




**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 26 :** జిల్లాలో కొనసాగుతున్న జనగణన కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులతో కలిసి జనగణన ప్రక్రియపై నిర్వహించిన వర్చువల్ సమీక్ష సమావేశంలో కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా 2011 జనగణన వివరాలతో పోలిస్తే ప్రస్తుత నమోదులో ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా పూర్తి ఖచ్చితత్వంతో డేటాను నమోదు చేయాలని సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు మరియు ఇతర అధికారులకు సూచించారు. జిల్లాలో ప్రతి ఇంటి వివరాలను సమగ్రంగా నమోదు చేయడంతో పాటు ఒక్కరూ మిగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. జనగణన కార్యక్రమం విజయవంతం కావాలంటే క్షేత్రస్థాయిలో పని చేసే అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయడం అత్యంత అవసరమని తెలిపారు. సర్వే నిర్వహణలో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రక్రియకు ఎటువంటి అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. జనగణన ద్వారా ప్రభుత్వ ప్రణాళికలు, సంక్షేమ కార్యక్రమాల అమలుకు అవసరమైన కీలక సమాచారం సిద్ధమవుతుందని, అందువల్ల ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీఓలు రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భరత్ నాయక్, రోజ్‌మాండ్, ల్యాండ్ అండ్ సర్వే రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ అరుణ్ కుమార్, సంబంధిత తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## కౌమార బాలికలకు పోషకాహార లోపం లేకుండా చూడాలి

- బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పైన అవగాహన కల్పించాలి



**రామచంద్రాపురం, ఆంధ్రనాడు, మే 26 :** కౌమార బాలికలకు పోషకాహార లోపం లేకుండా చూడాలని డిస్టిక్ మిషన్ కోఆర్డినేటర్ కృష్ణ మంజరి అన్నారు. రామచంద్రాపురం మండలం లోని కుప్పం బాదూరు అంగన్వాడి కేంద్రంలో కిషోర్ వికాసంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసారు. కిషోర్ బాలికలపై ప్రాథమిక సమాచారం, కౌమార బాలికలలో పోషకాహార లోపాలు, అధిక బరువు మరియు ఊబకాయం నివారణ, సూక్ష్మ పోషకాల లోపాలు, ఐరన్ లోపం మరియు రక్తహీనత వంటి అంశాలపై కిషోర్ బాలికలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వలన జరిగే అనర్థాలను వివరించారు బాలల అక్రమ రవాణా నివారించాల్సిన అవసరం ఉందన్నారు. చైల్డ్ హెల్ప్ లైన్–1098,గుడ్ టచ్–బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించారు. యంపిహెచ్ఇఓ వ్యక్తిగత ఆరోగ్యం, 18 సంవత్సరాల లోపు గర్భధారణ వలన జరిగే అనర్థాలను గురించి తెలియజేశారు. అంగనవాడి పర్యవేక్షకురాలు రేవతి మాట్లాడుతూ ఐసిడిఎస్ అందిస్తున్న పౌష్టికాహారం గురించి వివరించారు. బాలబాలికలు ఫిజికల్ డెవలప్మెంట్ కొరకు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలిచిన వారికి బహుమతులు కృష్ణ మంజరి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమాలలో డిసిపి యూనిట్ ముని కోకిల.సరస్వతి, డి జాహ్నవి, ఏఎన్ఎండి సుజిత, ఆశా వర్కర్. సరస్వతి. అంగన్వాడి కార్యకర్తలు బి మాలతి. జి శాంతి. జమున పాల్గొన్నారు. ఈ క్రమంలోనే సి రామాపురం పంచాయతీ లోని లోకమాతాపురం అంగనవాడి కేంద్రంలో సూపర్ వైజర్ మనీల ఆధ్వర్యంలో కిశోర బాలికల వికాసంపై అవగాహన కల్పించారు బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత, ఆత్మవిశ్వాసం వంటి పలు విషయాలపై కూలంకషంగా వివరించారు. చదువుతో విజ్ఞానం జీవితానికి వెలుగు వస్తుందని,పౌష్టికాహారంతో ఆరోగ్యం, శరీరానికి బలం చేకూరుతుందని, ఆటలు వ్యాయామం యోగాతో ఆత్మవిశ్వాసం కలగటమే కాక భవిష్యత్తుకు బంగారు బాట ఏర్పడుతుందని అంశాలను పలు ఉదాహరణలతో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సహాయకురాలు రుక్మిణి దేవి కిశోర బాలికలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ప్రజలకు మెరుగైన సేవలతో ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురండి : ఎంపీడీవో పులిరాం సింగ్




**రామచంద్రాపురం – ఆంధ్రనాడు, మే 26:** ప్రజలకు మెరుగైన సేవలు అందించటంతో పాటు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురాండని యంపిడిఓ పులిరాం సింగ్ అన్నారు. మండలంలోని స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల సిబ్బంది ప్రజలకు పారదర్శకంగా మెరుగైన సేవలందించి ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా పనిచేయాలని ఎంపీడీవో పులిరాంసింగ్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశపు మందిరంలో స్వర్ణ గ్రామ,వార్డ్ కార్యాలయాల సిబ్బంది,వీఆర్వోలతో సంక్షేమ పథకాల అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పి4 కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో విజయవంతం చేయాలని,ప్రజలలో ప్రభుత్వంపై సానుకూల అభిప్రాయం ఏర్పడేలా ప్రతి సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ప్రతి దరఖాస్తు మరియు సమస్యను నిర్ణీత సమయానికి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. త్రాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. స్వర్ణ గ్రామ వార్డు డిప్యూటీ ఎంపీడీవో తేజోవతి మాట్లాడుతూ మండలంలో 11 స్వర్ణ గ్రామ వార్డు కార్యాలయాల పరిధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సక్రమంగా పంపిణీ చేయాలని చెప్పారు.గ్రామాలలో స్వర్ణాంధ్ర,స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో చెత్త సేకరణ చేసి పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు.సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేటట్లు చూడాలన్నారు. గ్రామాలలో పెండింగ్ లో ఉన్న సిటిజన్ ఈకేవైసీని తురతి గతంలో పూర్తి చేయాలని ఆమె కోరారు.ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ అమృత, పంచాయతీ కార్యదర్శులు సురేష్, వెన్నెల, సతీష్, ఝాన్సీ, శివకుమార్,వీఆర్వోలు ఝాన్సీ రాణి, శ్రీనివాసులు,రాజశేఖర్,మల్లికార్జున్ రెడ్డి, నరసింహులు, ప్రదీప్ నాయుడు,వెంకటరమణ స్వర్ణ గ్రామ వార్డు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## దివ్యాంగ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు శిక్షణ: శ్రీసిటీ ఎండీ



**శ్రీసిటీ – ఆంధ్రనాడు, మే 26:** దివ్యాంగ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని శ్రీసిటీలో త్వరలో ప్రారంభించనున్నట్లు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్. రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు. విజయవాడలో సోమవారం నిర్వహించిన ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ -- 2026లో ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో ఈ మేరకు శ్రీసిటీ ఎండీ అవగాహన ఒప్పందం పై సంతకం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. గ్రోత్ సమ్మిట్ లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, దివ్యాంగ యువతకు వ్యవస్థాపక శిక్షణ అందించేందుకు శ్రీసిటీ చొరవను అభినందించారు. సమర్థవంతమైన ప్రణాళిక, పనితీరు, నిరంతర కృషి వల్లే శ్రీసిటీ దేశంలోని అగ్రశ్రేణి పారిశ్రామిక పార్కులలో ఒకటిగా ఎదిగిందని ప్రశంసించారు. పారిశ్రామిక రంగ అభివృద్ధికి మరిన్ని ప్రైవేట్ సంస్థలు ముందుకు రావాల్సిన అవసరాన్ని శ్రీసిటీ ప్రయాణం, అనుభవం స్పష్టం చేస్తోందన్నారు. డా. రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, శ్రీసిటీ ఎప్పుడూ సమగ్ర అభివృద్ధికే ప్రాధాన్యత ఇస్తోంది. దివ్యాంగ యువతకు వ్యవస్థాపక శిక్షణ, ఇతర నైపుణ్యాలు అందించడం ద్వారా వారికి స్వయం ఉపాధి మార్గాలను సృష్టించడమే కాకుండా, సామాజిక సమానత్వం మరియు పారిశ్రామిక పురోగతిపట్ల మా కట్టుబాటును మరింత బలపరుస్తున్నాం అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ "ఒక కుటుంబం – ఒక వ్యాపారవేత్త" లక్ష్యానికి అనుగుణంగా, ఆంధ్రప్రదేశ్ లో 1 కోటి మంది వ్యాపారవేత్తలను తయారు చేయాలనే సంకల్పానికి దివ్యాంగ యువత శిక్షణ కార్యక్రమం తోడ్పాటు అందించనుందని ఆయన పేర్కొన్నారు.

## శ్రీ పల్లి కొండేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్న డీఈవో



**నాగలాపురం – ఆంధ్రనాడు, మే 26:** నాగలాపురం మండలం సురుటుపల్లి గ్రామపంచాయతీలో వెలసి ఉన్న శ్రీ పల్లి కొండేశ్వర స్వామి ఆలయాన్ని తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్ కుటుంబ సభ్యులతో దర్శనానికి రావడంతో నాగలాపురం యుటిఎఫ్ యూనియన్ అధ్యక్షుడు జి. రవి శాలువా కప్పి ఆహ్వానించి దర్శనాన్ని దగ్గరుండి చేయించారు. ఈ కార్యక్రమంలో నాగలాపురం యుటిఎఫ్ నాయకులు వాసు, విజయ్ కుమార్, దేవేంద్ర, ఈశ్వర్ పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



**కార్వేటినగరం – ఆంధ్రనాడు, మే 26 :** సంపూర్ణ ఆరోగ్యానికి యోగా సాధన చక్కని అవకాశం మని ఐసీ డీ యస్ సూపర్వైజర్ రోజా రమణి అన్నారు. కార్వేటినగరం పెద్ద హరిజనవాడ లో కిషోర్ వికాసం సమ్మర్ క్యాంపన్ ను కిసోరి బాలికలు, స్థానికులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శారీరక వ్యాయామం ప్రాముఖ్యత, క్రీడలు ఆటలు,నిత్యం యోగ ఆసనాలు వేయడం సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ ఉమా, ఉష. ఆశ కార్యకర్త లోకేశ్వరి, సరస్వతి, అంగన్వాడీ కార్యకర్త వసుంధర, కిషోరి బాలికలు పాల్గొన్నారు.

## పదవ తరగతి సప్లిమెంటరీ ఇంగ్లీష్ పరీక్ష వాయిదా..

**తంబళ్లపల్లి – ఆంధ్రనాడు, మే 26:** మే 28న గురువారం బక్రీద్ పండుగ సెలవు కారణంగా పదవ తరగతి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ ఇంగ్లీష్ పరీక్షను జూన్ 5వ తేదీ శుక్రవారానికి మార్పులు చేసినట్టు డీఈఓ సుబ్రహ్మణ్యం నుంచి ఉత్తర్వులు వెలువడినట్టు ఎంఈఓలు త్యాగరాజు, నాగ సుబ్బారాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.మే 28న ఇంగ్లీష్ పరీక్ష జరగాల్సి ఉండగా.. ప్రభుత్వం 28వ తేదీ బక్రీద్ సెలవు ప్రకటించడంతో పరీక్ష తేదీని మార్చినట్టు పేర్కొన్నారు.విద్యార్థులు, తల్లితండ్రులు ఈ విషయాన్ని గమనించాలని మండల విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు.

## తెలుగుదేశం పార్టీ సమావేశానికి ఆహ్వానం



**నాగలాపురం – ఆంధ్రనాడు, మే 26:** నాగలాపురం మండలంలోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, క్లస్టర్ ఇన్చార్జులు, బూత్ ఇన్చార్జులు, గ్రామ అధ్యక్షులు, యువ నాయకులు, కార్యకర్తలు నాగలాపురం బైపాస్ రోడ్ వద్ద ఉన్న గురు అనుగ్రగా తిరుమన మండపంలో నేడు జరగబోవు మహానాడు కార్యక్రమనికి ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని ప్రతి ఒక్కరూ హాజరవ్వాలని ప్రత్యేకంగా ఆహ్వానించిన నాగలాపురం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు టీజేబి ప్రణీత్ రెడ్డి.

# బాల్య వివాహాలపై ర్యాలీ



**నాగలాపురం – ఆంధ్రనాడు, మే 26:** బాలికలలో ఆత్మ విశ్వాసం పెంపొందించడానికె కూటమి ప్రభుత్వం కిషోరి వికాసం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు పిచ్చాటూరు సిడిపిఓ సౌభాగ్యమ్మ ఆదేశాలతో మంగళవారం నాగలాపురం పట్టణంలోని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయం ఆవరణంలో అంగన్వాడి సూపర్వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమని, ఇందులో భాగంగానే మే ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు కిషోరి వికాసంపై ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఆయా అంగన్వాడి కేంద్రాల్లో కౌమార బాలికలకు అవగాహన కార్యక్రమాలు జరుగుతుందన్నారు. కౌమార దశలో బాలికలు రక్తహీనతకు గురి కాకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. దీనివల్ల ఆరోగ్యం కూడా కాపాడుకోవాలని, ప్రస్తుతం మహిళపై లైంగిక దాడులు వేధింపులు అధికమవుతున్న నేపథ్యంలో మానసిక స్థైర్యంతో ముందుకు వెళ్లాలని, ఇందుకోసం బాలికలు ఉన్నత చదువులు చదువుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా మహిళలకు ఉన్న హక్కులు, చట్టాలపై అవగాహన ఏర్పడుతుందని, చదువుతోపాటు నైపుణ్య అభివృద్ధి పెంచుకోవాలన్నారు. ప్రధానంగా బాలికల సగటు వివాహ వయస్సును పెంచడం, లింగ సమానత్వం తీసుకురావడంతో పాటు వారి భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం యొక్క ఉద్దేశం అన్నారు. అనంతరం ఆరోగ్యం, పోషకహారం, ఋతుపారిశుభ్రత, పోస్కో యాక్ట్, బాల్యవివాహాలు, డ్రగ్స్, స్కిల్స్, సైబర్ నేరాలు తదితర అంశాలపై సూపర్వైజర్ శ్రీదేవి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్త, సహాయకురాలు పాల్గొన్నారు.

## దారిదోపిడి నిందితులు ఇద్దరూ యువకులు, ఒక బాలుడు అరెస్టు



**సత్యవేడు – ఆంధ్రనాడు, మే 26:** దారిదోపిడి కేసుకు సంబంధించి సత్యవేడు పట్టణానికి చెందిన సంతోష్, నితీష్తో పాటు మరో బాలుడును స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి మూడు గ్రాముల బంగారం ఉంగరం, ఇనుపచూర కత్తి స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న ఇనుప చూర కత్తిని సబ్ ఇన్స్పెక్టర్ సాయినాథ్ చౌదరి మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఎస్సై సాయినాథ్ చౌదరి కథనం మేరకు వివరాలు ఇలా. తమిళనాడు చెదులుపాకం గ్రామానికి చెందిన నాగరాజు మే 24వ తేదీన ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి సత్యవేడు వైపు వస్తున్నారు. మార్గమధ్యలో మాదర్పాకం మలుపు వద్ద యువకుడు ఒకరు ద్విచక్ర వాహనాన్ని ఆపి చేయిబాగాలేదు లిఫ్టు అడిగారు. మానవతా దృక్పథంతో నాగరాజు యువకుడు సంతోష్ను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని శ్రీకాళహస్తి బస్టాప్ వద్దకు తీసుకెళ్లాడు. అయితే అక్కడ సంతోష్ దిగకుండా బీసీ కాలనీకి తీసుకెళ్లాలని కోరారు. దీంతో నాగరాజు ద్విచక్ర వాహనంపైనే సంతోష్ను బీసీ కాలనీ వద్దకు తీసుకెళ్లారు. అయితే అక్కడికి వెళ్ళగానే నాగరాజు వెనుక వైపు నుంచి కత్తి చూపించి నేను చెప్పిన చోటకు తీసుకెళ్లాలని బెదిరించారు. భయభ్రాంతులకు గురైన నాగరాజు ఎదురు తిరగకుండా పాలిటెక్నికల్ కళాశాల వెనుక వైయస్సార్ కాలనీ వద్దకు సంతోష్ను తీసుకెళ్లగానే అప్పటికే అక్కడ వేచి ఉన్న సంతోష్ స్నేహితులు ఒక్కసారిగా నాగరాజు వైపుకు కత్తి చూపించి చేతిలో ఉన్న ఉంగరాన్ని లాక్కున్నారు. దీంతో పాటు జేబులో డబ్బులు ఉంటే ఇవ్వాలంటూ అణువణువు గాలించారు. కానీ డబ్బులు లేకపోవడంతో బంగారపు ఉంగరంతో ముగ్గురు నిందితులు పరారయ్యారు. దీనిపై బాధితుడు నాగరాజు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వడంతో వెంటనే కేసు నమోదు చేసి స్థానిక ఎస్సై సాయినాథ్ చౌదరి రంగంలోకి దిగారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం చెన్నై మార్గంలో ఆంధ్ర సరిహద్దు తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ తరలించి విచారించారు. దీంతో నాగరాజుకు కత్తి చూపించి బంగారు ఉంగరాన్ని లాక్కొని వెళ్ళింది నిజమేనని అంగీకరించడంతో సత్యవేడు పట్టణం బీసీ కాలనీకి చెందిన నిందితుడు సంతోష్ (18, నితీష్ కుమార్(18), రాజీవ్ నగర్కు చెందిన మరో బాలుడిని అరెస్టు చేసి చిత్తూరు కోర్టులో హాజరు పరచామని ఈ సందర్భంగా ఎస్ఐ సాయినాథ్ వివరించారు. కేసు నమోదు చేసిన 24 గంటల్లో నిందితులను గుర్తించి అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం పట్ల పోలీసు ఉన్నతాధికారులు సిబ్బందిని అభినందించారు.

## శ్రీ పల్లి కొండేశ్వర స్వామి దేవస్థానం నందు వైభవోపేతంగా గురుసంచార పూజలు



**నాగలాపురం – అంధ్రనాడు, మే 26:** నాగలాపురం మండలం సురుటుపల్లి గ్రామంలో వెలసియుండు శ్రీ సర్వ మంగళ సమేత శ్రీ పల్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం గురుసంచార పూజలు అత్యంత వైభవముగా నిర్వహించారు. దేవస్థానం ప్రదోష మండపంలో 9 అడుగుల పొడవుతో వృషభ వాహనంపై చందనకాపు అలంకార సోభితుడైన దక్షిణామూర్తి స్వామి ప్రతిమను ఏర్పాటు చేసి పరిహార సంకల్పంములు ప్రారంభించారు. అనంతరం ఆలయం ఉన్న శ్రీ దంపతి సమేత దక్షిణా మూర్తి స్వామి వారికి ప్రత్యేక అలంకారం చేసి వివిధ పుష్పాలు ఆవరణములతో సుందరంగా అలంకరించి గురు సంచార పూజలో పాల్గొన్న భక్తులకు పరిహార అర్చనలు జరపడం జరిగింది. ఉదయం 11:00 గం.లకు నవగ్రహంలోని గురు భగవాన్ స్వామికి, నవగ్రహములకు వివిధ పంచామృతములతో మహాభిషేకం నిర్వహించి ధూప దీప నైవేద్యములు సమర్పించారు. ఈ గురుసంచార పూజలు పరిహారం చేసుకొనుటకు మేషం, కుంభం, తులా, సింహం కర్కాటకం, ధనుస్సు, వృషభం మొదలగు రాశి వారు గురు పరిహార పూజలు చేసుకొనుటకు పెద్ద సంఖ్యలో పాల్గొని పరిహార సంకల్ప అర్చనలు చేయించుకుని స్వామి వారి ప్రసాదములు స్వీకరించారు. ఈ గురు సంచార పూజలకు సత్యవేడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి.శంకర్ రెడ్డి చందన కాపు అలంకారం, పుష్పాలంకరణకు ఉబయదారులుగా వ్యవహారించారు. పొన్నేరికి చెందిన మనోహర్ రెడ్డి ప్రసాదం, హోమం ఉభయదాతలుగాను, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్.రవీంద్ర సన్నా రెడ్డి అన్నదానం ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈ గురు సంచార పూజలకు స్వామి వారి దర్శనార్థం తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు పనబాక.లక్ష్మి, సత్యవేడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి. శంకర్ రెడ్డి, తి.తి.దే పాలకమండలి సభ్యులు నరేష్, పిచ్చాటూరుకు చెందిన వ్యాపారవేత్త పి.మునిశేఖర్ నాయుడు, మోహన్ రెడ్డి పాల్గొన్నారు. కార్యనిర్వహణాధికారిణి పి.లత స్వామి వారి దర్శనం, పరిహార సంకల్పం చేయించి ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదములు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండల సభ్యులు పి.హంస రుద్రయ్య, కె.శ్రీనివాసులు, ఎస్.కృష్ణయ్య, బి.జయంతి మునికుమార్, ఎస్.దేవి ధనశేఖర్ అర్చకులు సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## మహానాడును పండుగలా జరుపుకుందాం..

**- అందరం కలసి పసుపు పండుగను విజయవంతం చేద్దాం**



**తంబళ్లపల్లి – అంధ్రనాడు, మే 26:** మహానాడును పండుగ వాతావరణంలో కలసి కట్టుగా విజయవంతం చేద్దామని తంబళ్లపల్లి టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు దినేశ్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎస్ఎల్వీ కల్యాణ మండపంలో టీడీపీ మండల నాయకులతో బుధవారం నుంచి 2రోజుల పాటు తంబళ్లపల్లిలో జరిగే డిజిటల్ మహానాడు నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. తంబళ్లపల్లెలోని రెండు కల్యాణ మండపాల్లో సిల్వర్ స్క్రీన్లు ఏర్పాటు చేసి మహానాడు కార్యక్రమాన్ని ప్రదర్శిస్తున్నట్టు తెలిపారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతిని పుర స్కరించుకొని చేపట్టే మహానాడు టీడీపీ నాయకులు, కార్యకర్తలకు పండుగ లాంటిదన్నారు. నాయకులు, కార్యకర్తలు వర్గ బేధాలు వీడి రెండు రోజుల పాటు జరిగే మహానా డును మన సొంత కార్యక్రమంలా బాధ్యతగా చేద్దామన్నారు. ప్రతి బూత్ నుంచి ఒక్కో నాయకుడు, కార్య కర్త 10మందిని మహానాడుకు తీసుకువచ్చి కార్యక్రవ మాన్ని జయప్రదం చేద్దామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి, మండ లాధ్యక్షుడు రెడ్డెప్ప రెడ్డి, తెలుగు యువత రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షులు దేరంగుల చంద్ర, మండల బీసీ నాయకులు పురుషోత్తం, వీరాంజనేయులు, మాజీ జెడ్పీటీసి రామచంద్ర, క్లస్టర్ ఇంచార్జిలు బేరి శ్రీనివాసులు, బీఎంఆర్ రెడ్డెప్ప యాదవ్, యూనిట్ ఇంచార్జి కాలా నారాయణ, తెలుగు యువత నాయకులు నరసింహులు, గంగరాజు, సుగవాసి శివకుమార్, మాజీ గ్రామాధ్యక్షుడు బోయపల్లె శివ, రాజంపేట బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోమశేఖర్, మాజీ ఉప సర్పంచి సుబ్రహ్మణ్యం, టీడీ పీ గ్రామధ్యక్షులు, నాయకులు లోకేశ్వర్ రెడ్డి, మదన్ మోహన్, ధన శేఖర్, సోమశేఖర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జీతాలివ్వలేదని పారిశుధ్య కార్మికులు నిరసన..



**తంబళ్లపల్లి – ఆంధ్రనాడు, మే 26:** మూడు నెలలుగా జీతాలతో పాటు సొంత డబ్బులు పెట్టి చేసిన రిపేరీ పనులకు బిల్లులు ఇవ్వలేదని తంబళ్లపల్లి పంచాయతీలో పనిచేసే పారిశుధ్య కార్మికులు, వాటర్ మెన్స్ నిరసన తెలిపారు.మంగళవారం పారిశుధ్య కార్మికులు,వాటర్ మెన్స్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసనలు తెలిపి ఎంపీడీఓ ఎంవీ ప్రసాద్, ఎస్ఐ అనిల్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు.వారు మాట్లాడుతూ.. తమకు గత మూడు నెలలుగా జీతాలివ్వలేదని కుటుంబాలను ఎలా పోషించాలన్నారు.కార్యదర్శి ఆదేశాలతో సొంత డబ్బులు పెట్టి మంచి నీటి పైప్ లైన్లతో పాటు చెత్తను తరలించే ట్రాక్టర్ మరమ్మత్తులు చేయించామన్నారు.ఆ డబ్బులు కూడా రేపు, మాపు అంటూ కాలం వెళ్లదీస్తున్నారని వాపోయారు. జూన్ 1వ తేదీ లోపు పెండింగ్ జీతాలతో పాటు తాము సొంతంగా ఖర్చు చేసిన డబ్బులు ఇవ్వకుంటే విధులు బహిష్కరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పారిశుధ్య కార్మికులు వసంతమ్మ, రెడ్డెమ్మ, రాజమ్మ, మనోహర్, భాస్కర్, వాటర్ మెన్లు మస్తాన్, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## అందరూ సమన్వయంతో పనిచేసి మహానాడును విజయవంతం చేయాలి: పరిశీల కురాలు పర్వీన్ తాజ్



**తిరుపతి, మే 26, (ఆంధ్రనాడు):** ఈనెల 27, 28 తేదీలలో జరగబోయే తెలుగుదేశం పార్టీ డిజిటల్ మహానాడులో నాయకులందరూ పాల్గొని విజయవంతం చేయాలని తిరుపతి నియోజకవర్గ టిడిపి పరిశీలకురాలు పర్వీన్ తాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం 12వ క్లస్టర్ పరిధిలోని ఇన్చార్జిలతో పరిశీల కురాలు పర్వీన్ తాజ్ మహానాడు పై సమావేశం అయ్యారు. అంతకుమునుపు పరిశీలకురాలు పర్వీన్ తాజ్, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ లకు టిడిపి మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి, తిరుపతి కోపరేటివ్ బ్యాంకు మాజీ డైరెక్టర్ షేక్ మహబూబ్ బాషా నేతృత్వంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు షబ్బీర్, పట్టణ మైనారిటీ కార్యదర్శి ముబారక్, అహమ్మద్ లు ఘన స్వాగతం పలికారు. షేక్ మహబూబ్ బాషా శాలువాతో పరిశీల కురాలు పర్వీన్ తాజ్ ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పర్వీన్ తాజ్ మాట్లాడుతూ డిజిటల్ మహానాడులో పార్టీ నాయకులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని అందుకు ఒకరిని ఒకరు సమన్వయం చేసుకొని ముందుకు సాగాలన్నారు. మహానాడు ను విజయవంతం చేసేందుకు కార్యక్రమాలన్నీ సజావుగా జరగాలని ఆయా కార్యక్రమాలను ఆమె పర్యవేక్షించి పలు సూచనలను, సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ సమావేశంలో టిడిపి నగర మహిళా అధ్యక్షురాలు ర్యాంకు శాంతమ్మ, జిల్లా కార్యదర్శి రేవతి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మెగా డీయస్సి హిట్ కావడంతో అసత్య ఆరోపణలు చేస్తున్న జగన్

**:తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాగల ఆనంద గౌడ్**



**తిరుపతి, ఆంధ్రనాడు, మే 26 :** ఎన్నో ఏళ్ల నిరుద్యోగుల కలను తెలుగుదేశం ప్రభుత్వం సహకారం చేస్తే దీనిపై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం అలవాటుగా మారింది. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్ గౌడ్ జగన్ తీరుపై మండిపడ్డారు. ఐదేళ్లు ఒక్క టీచర్ ఉద్యోగం ఇవ్వకుండా నేడు మంత్రి నారా లోకేష్ గారు కృషితో మెగాడీఎస్సి హిట్ కావడంతో అసత్య ఆరోపణలు చేస్తున్నారని వారు వారన్నారు అదేవిధంగా. మెగా డి ఎస్ సి ద్వారా వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం టీడీపీ నిబద్ధతకు నిదర్శనం. అలాగే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీల మేరకు నిరుద్యోగ యువత కోసం మెగా డీస్సీ ప్రకటించి, ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. మీరు గతంలో మీ తండ్రి అధికారంలో ఉన్నప్పుడు జరిగిన టీచర్ ఉద్యోగాల భర్తీలో జరిగిన అవకతవకలను ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారు. అప్పుడు ఎంతో మంది నిజాయితీగా కష్టపడి చదివిన అభ్యర్థులకు అన్యాయం జరిగి, అర్హత లేని వారికి అవకాశాలు కల్పించి మీరు అడ్డంగా దొరికిన ఘటనలను ప్రజలు ఇంకా మర్చిపోలేదు జగన్ రెడ్డి. కూటమి ప్రభుత్వం నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన పారదర్శకత, ప్రతిభ, న్యాయం అనే మూడు సూత్రాలకే కట్టుబడి ఉంటుంది. నిజాలు ఎప్పటికైనా ప్రజల ముందుకు వస్తాయి. అబద్ధపు ప్రచారం ఎంత చేసినా యువత భవిష్యత్తుపై మా ప్రభుత్వ నిబద్ధత ఏమాత్రం మారదు. వారు అన్నారు అబద్ధాలు చెప్పడమే జగన్ పార్టీ నైజం అని వారన్నారు.

## అమ్మవారి ఆలయానికి 3 బీరువాలు బహూకరణ



**తిరుచానూరు – ఆంధ్రనాడు, మే 26:** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి రూ. 42,000 విలువైన మూడు బీరువాలను తిరుపతి కు చెందిన విరుపాక్షి జయచంద్రారెడ్డి మంగళవారం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు బాబుస్వామికు దాతలు బీరువాలను అందజేశారు. వీటిని ఆలయ విభాగంలో వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు

**- పెండింగ్ భూసేకరణ, కోర్టు కేసులు త్వరగా పరిష్కరించాలి**
**- జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్**




**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 26:** జిల్లాలో కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, భూసేకరణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రాజెక్టుల పురోగతి, రెవెన్యూ, రైల్వే, జాతీయ రహదారుల పనులపై, డిఆర్ఓ నరసింహులుతో కలిసి ఏపీఐఐసీ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శ్రీసిటీ, నాయుడుపేట, పాగలి, వానెల్లూరు ప్రాంతాల్లోని భూసేకరణ పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కోర్టు కేసులు, వెబ్‌ల్యాండ్ సమస్యలు కూడా త్వరగా పరిష్కరించా లని సూచించారు. అలాగే జాతీయ రహదారులు, సాగరమాల ప్రాజెక్టు కింద చేపట్టిన ఆరు లైన్ల రహదారులు, రైల్వే మార్గాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంబంధిత ఆర్డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలె క్టర్లు, ఇంజనీరింగ్ అధికారులు, భూసేకరణ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత, డ్రగ్స్ నియంత్రణపై

**- సమన్వయ చర్యలు కఠినంగా అమలు చేయాలి**
**- ప్రమాదాల నివారణకు 60 రోజుల కార్యాచరణపై దృష్టి**
**- డ్రగ్స్ నియంత్రణలో కట్టుదిట్టమైన నిఘా అవసరం**
**- బ్లాక్ స్పాట్ల వద్ద తక్షణ భద్రతా చర్యలకు ఆదేశం**
**- జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్**




**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 26:** జిల్లాలో రహదారి భద్రత, బ్లాక్ స్పాట్ల గుర్తింపు, అలాగే మాదక ద్రవ్యాల నియంత్రణపై అన్ని శాఖలు సమన్వయంతో కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడుతో కలిసి ఆయన ఎన్‌సీఓఆర్డీ (నాకార్డ్), జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాన్ని నేషనల్ హైవే, రవాణా, పోలీస్, డ్రగ్స్ నియంత్రణ శాఖల అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ రహదారులపై ప్రమాదాలకు కారణమవుతున్న బ్లాక్ స్పాట్లను గుర్తించి వెంటనే హెచ్చరిక బోర్డులు, రోడ్ మార్కింగ్‌లు, రిఫ్లెక్టర్లు, వీధి దీపాలు, స్పీడ్ నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే బస్సు యాత్రలో గుర్తించిన బ్లాక్ స్పాట్లపై తక్షణ నివేదికలు సమర్పించాలని సూచించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 60 రోజుల గడువులో ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రహదారులపై మరమ్మత్తులకు గురైన వాహనాలు, నిబంధనలకు విరుద్ధంగా నిలిపిన వాహనాలను తక్షణమే తొలగించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల తగ్గింపునకు డ్రైవర్లు, వాహన యజమానులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. అదే విధంగా డ్రగ్స్ నియంత్రణపై కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని, విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు పెంచాలని తెలిపారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు మాట్లాడుతూ, డ్రగ్స్ నిర్మూలనలో పోలీస్ శాఖ అప్రమత్తంగా పనిచేస్తోందని, అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ప్రజల సహకారంతో మరింత ప్రభావవంతమైన ఫలితాలు సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ చర్యలను వివరించగా, శాఖల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేయాలని సమావేశం నిర్ణయించింది.



# మ్యాపింగ్ ప్రక్రియపై రాష్ట్ర స్థాయి సమీక్ష

**- ఓటర్ల జాబితా రివిజన్‌కు యుద్ధ ప్రాతిపదిక ఆదేశాలు**
**- ఎన్నికల ప్రక్రియపై అధికారుల దృష్టి**

**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 26:** రాష్ట్రంలో చేపడుతున్న ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్–2026) ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ సూచించారు. 2002 ఓటర్ల జాబితాతో ప్రస్తుత ఓటర్ల జాబితాను మ్యాపింగ్ చేసే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్–2026 పురోగతిని సమీక్షించారు. ఈ సమావేశంలో మ్యాపింగ్ ప్రక్రియలో జరుగుతున్న పనులపై వివరంగా చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఈఆర్వో, ఏఈఆర్వో, బీఎల్‌వో స్థాయిలో సమన్వయాన్ని బలోపేతం చేసి ఓటర్ల జాబితా మ్యాపింగ్ పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. జిల్లాల కలెక్టర్లు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి ప్రక్రియలో ఉన్న




అడ్డంకులను తొలగించాలని సూచించారు. తిరుపతి జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ హాజరై జిల్లాలో జరుగుతున్న పనుల పురోగతిని వివరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అన్ని స్థాయిల్లో సమీక్షలు నిర్వహించి మ్యాపింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌వో) నరసింహులు, ఏడు నియోజకవర్గాల ఈఆర్వోలు తదితర అధికారులు పాల్గొన్నారు.

# పీలేరు నియోజకవర్గంలో 10 క్లస్టర్లలో ఘనంగా డిజిటల్ మహానాడు వీక్షణ

**- ప్రతి కార్యకర్త పాల్గొనాలి ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి**



**పీలేరు, ఆంధ్రనాడు, మే 26:** దివంగత నేత నందమూరి తారక రామ రావు జన్మదినాన్ని పురస్కరించుకుని తెలుగు దేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "డిజిటల్ మహానాడు" కార్యక్రమాన్ని పీలేరు నియోజకవర్గంలో పండుగ వాతావరణంలో విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 27, 28 తేదీలలో నిర్వహించనున్న ఈ చారిత్రాత్మక కార్యక్రమాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి కార్యకర్త, అభిమాని వీక్షించాలని ఆయన కోరారు. ప్రజాప్రతినిధులు, మండల మరియు పట్టణ అధ్యక్షులు, కార్యదర్శులు, క్లస్టర్ ఇంచార్జ్‌లు, టీడీపీ అనుబంధ సంఘాలు, మహిళా సంఘాలు, నల్లారి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన 10 క్లస్టర్లలో జరిగే మహానాడు కార్యక్రమాన్ని అందరితో కలిసి వీక్షిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పీలేరు నియోజకవర్గంలోని 10 క్లస్టర్ కేంద్రాలు, గుర్రంకొండ మండలం – మధు కళ్యాణ మండపం, తరిగొండ – ఆర్యవైశ్య కళ్యాణమండపం, కలకడ – బాలాజీ ఫంక్షన్ హాల్, కె.వి.పల్లి – టీడీపీ కార్యాలయం, వాయల్పాడు చింతపర్తి పట్టణం – ఆర్యవైశ్య కళ్యాణమండపం, వాయల్పాడు – మార్కెట్ యార్డు ఆవరణ, కలికిరి మండలం – గడి ప్రాంతం, కలికిరి – అమర్నాథ్ రెడ్డి కార్యాలయం, పీలేరు పట్టణం తిరుపతి రోడ్డు – ఎంఎన్ఆర్ మినీ గార్డెన్ కళ్యాణమండపం, పీలేరు మండలం బోడుమల్లు వారి పల్లి – మొరవవడ్డిపల్లి వెంకటేశ్వర కళ్యాణ మండపం "అన్న ఎన్టీఆర్ ఆశయ సాధనకు, ఎన్. చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయడానికి ఈ డిజిటల్ మహానాడు వేదిక కానుంది. ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు తరలివచ్చి 10 క్లస్టర్లలో ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్ల ద్వారా కార్యక్రమాన్ని వీక్షించాలి. ఇది మనందరి బాధ్యత" అని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# సెక్యూరిటీ గార్డుల నియామకం కోసం దరఖాస్తుల ఆహ్వానం..

తిరుపతి, మే 26, (ఆంధ్రనాడు): అవుట్ సోర్సింగ్ పద్ధతి ద్వారా సెక్యూరిటీ గార్డులుగా పనిచేయడానికి ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బైరాగి పట్టణంలోని పద్మావతి పార్కు వెనుకవైపునున్న మహర్షి అభ్యుదయ సేవా సంస్థ ప్రతినిధి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెక్యూరిటీ గార్డు ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకునే ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తుతో పాటు విద్యా అర్హత జిరాక్స్ కాపీలు, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్ కార్డు, బ్యాంకు ఎకౌంటు వివరాలు జతపరిచి దరఖాస్తులను స్వయంగా మహర్షి అభ్యుదయ సేవా సంస్థ (మాస్ ) లో అందజేయాలని పేర్కొన్నారు. గతంలో సెక్యూరిటీ గార్డులుగా పనిచేసిన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది అని ఆ సంస్థ అధ్యక్షులు కే. జ్ఞాన శేఖర్ రెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఏవైనా సందేహాలు ఉన్న సెల్ నంబర్ 9392275861 కు సంప్రదించాలని జ్ఞాన శేఖర్ రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు.

# గంటావూరు గంగమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే సతీమణి రేణుకా రెడ్డి




**పలమనేరు, ఆంధ్రనాడు, మే 26:** మునిసిపల్ పరిధిలోని గంటావూరు గ్రామంలో వెలసిన గ్రామదేవత గంగమ్మ తల్లిని స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి సతీమణి రేణుకా రెడ్డి భక్తిశ్రద్ధలతో మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మురుగన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.అందరి కుటుంబ సభ్యుల సంక్షేమం, ప్రజల సుభిక్షం, ప్రాంత అభివృద్ధి కోసం అమ్మవారిని వేడుకున్నట్లు ఆమె తెలిపారు. గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానికులతో ఆత్మీయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. గ్రామదేవత గంగమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆమెకు తీర్థ ప్రసాదాలను అందజేసి ఆలయ మర్యాదలతో సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో తిరుపతి గంగమ్మ ఆలయ చైర్మన్ శ్రీధర్, పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు కుట్టీ, ప్రధాన కార్యదర్శి గిరిబాబు,సుబ్రహ్మణ్యం గౌడ్,ఖాజా, నాగరాజు, మదన్,సుదర్శన్ బాలాజీ, వెంకట రమణ, గంగవరం మండల నాయకులు గిరిధర్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు..

# గంగమ్మ తల్లి ఆశీస్సులతో...

**ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలి..**

**అమ్మవారికి మొక్కులు చెల్లించిన 'పులిగోరు'**



**తిరుపతి, మే 26, (ఆంధ్రనాడు):** శ్రీ తాతయ్య గుంట గంగమ్మ తల్లి ఆశీస్సులతో సకాలంలో వర్షాలు పడి రైతులు కు పంటలు బాగా పండి సంతోషంగా ఉండాలని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంకు మాజీ చైర్మన్ పులిగోరు మురళి కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం శ్రీ తాతయ్యగుంట గంగమ్మ అమ్మవారికి పులిగోరు మురళీకృష్ణారెడ్డి, ఆయన తనయురాలు పులిగోరు వీణారెడ్డి కుటుంబ సభ్యులు చందన వేషాలు ధరించి వేయికళ్ల దుత్తలతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించారు. అనంతరం పులిగోరు మురళీకృష్ణ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గంగమ్మ తల్లి ఆశీస్సులతో రాష్ట్రమంతా సకాలంలో వర్షాలు పడి చెరువుల కుంటలు నిండి వ్యవసాయం చేసుకునే రైతులకు సకాలంలో నీళ్లు సమృద్ధిగా లభించి సంతోషంగా జీవించాలన్నారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో అమ్మవారి ఆశీస్సులతో చల్లగా ఉండాలని ప్రార్థించినట్లు చెప్పారు. నేటి తరం పిల్లలు పెద్దలు ఉన్నత చదువులు చదువుకున్న క్రమం తప్పకుండా తాతయ్యగుంట గంగమ్మ తల్లి వేషాలు వేసి మొక్కులు సమర్పించి అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్, టిడిపి తిరుపతి పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి రామదాసు ముని రామయ్య, గంగమ్మ గుడి మాజీ పాలకమండలి సభ్యులు గంజి సుధాకర్ రెడ్డి, తెలుగు యువత నేత శరత్ చౌదరి, పులిగోరు అనుచరులు పాల్గొన్నారు.

# మేల్ మరువత్తూరు శక్తిపీఠం కమిటీ సభ్యుల గంగమ్మ దర్శనం



**పలమనేరు, ఆంధ్రనాడు, మే 26 :** మేల్ మరువత్తూరు శక్తిపీఠం కమిటీ సభ్యులు పలమనేరు మండల పరిధిలోని గంటావూరు బి.సి. కాలనీలో వెలసిన శ్రీ గంగమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ పర్యటనలో భాగంగా శక్తిపీఠం కమిటీ సభ్యులు... కమిటీ ప్రతినిధి మురుగన్ గారికి పవిత్ర 'ఓం శక్తి' గ్రంథాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో ఫోక్స్ కేసు నమోదు

**తిరుపతి, మే 26, (ఆంధ్రనాడు):** స్థానిక తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఫోక్స్ కేసు నమోదు చేయడం జరిగిందని తిరుచానూరు సిఐ సునీల్ కుమార్ మంగళవారం తెలియజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి 16 సంవత్సరాల మైనర్ బాలికపై మైనర్ బాలుడు బలాత్కార యత్నం చేయడం జరిగిందని వివరించారు. బాలిక తల్లి తిరుచానూరు పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# సీఎన్ఆర్ డిగ్రీ కళాశాల మైక్రోబయాలజీ విద్యార్థుల ఇంటర్న్‌షిప్

**పీలేరు – ఆంధ్రనాడు, మే 26:** అన్నమయ్య జిల్లాలోని పీలేరు ఏరియా ఆసుపత్రిలో సీఎన్ఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన బి.ఎస్‌సి మైక్రోబయాలజీ విద్యార్థులు ఒక నెలపాటు నిర్వహిస్తున్న ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు వైద్య రంగానికి సంబంధించిన ప్రాయోగిక పరిజ్ఞానాన్ని పొందడంతో పాటు ప్రజా ఆరోగ్య సేవల్లో తమ వంతు సహకారాన్ని అందిస్తున్నారు. ఇంటర్న్‌షిప్‌లో భాగంగా విద్యార్థులు రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు, ల్యాబ్ పరికరాల వినియోగం, సూక్ష్మజీవుల గుర్తింపు విధానాలు, శానిటేషన్ మరియు ఇన్‌ఫెక్షన్ నియంత్రణ చర్యలపై ఆసుపత్రి నిపుణుల పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్నారు. ఆసుపత్రి ల్యాబ్‌లో నిర్వహించే పలు పరీక్షల విధానాలను ప్రత్యక్షంగా పరిశీలిస్తూ వైద్య రంగంలో అవసరమైన అనుభవాన్ని సంపాదిస్తున్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ ఆరోగ్య కార్యక్రమమైన ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ నమోదు కార్యక్రమంలో కూడా విద్యార్థులు చురుకు



గా పాల్గొంటున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎ బి హెచ్ ఎ కార్డు ప్రాముఖ్యతను వివరించి, వారి ఆరోగ్య వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరచుకునేందుకు రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా రోగుల వైద్య సమాచారం దేశవ్యాప్తంగా సులభంగా అందుబాటులోకి రావడంతో పాటు వైద్య సేవలు మరింత వేగవంతం అవుతాయని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరిండెంట్ డా. చంద్రశేఖర్ మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవడం అభినందనీయమని తెలిపారు. ఆధునిక వైద్య విధానాలు, డిజిటల్ హెల్త్ సేవలపై అవగాహన పెంపొందించడంలో యువత పాత్ర కీలకమని పేర్కొన్నారు. కళాశాల అధ్యాపకులు బోదెషా వలి మాట్లాడుతూ, విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్‌తో పాటు సామాజిక బాధ్యత పెంపొందించేందుకు ఈ ఇంటర్న్‌షిప్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. విద్యార్థులు కూడా ఆసుపత్రి వాతావరణంలో పనిచేయడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత అవకాశాలకు సిద్ధమవుతున్నామని తెలిపారు. విద్య, వైద్య సేవలు మరియు డిజిటల్ ఆరోగ్య అవగాహనను కలిపిన ఈ కార్యక్రమం స్థానిక ప్రజల్లో మంచి స్పందన పొందుతోంది.

# గంగ జాతర రోజు పోలీసుల దౌర్జన్యం.. సాఫ్ట్వేర్ ఉద్యోగి కుటుంబంపై దాడి

**మదనపల్లి – ఆంధ్రనాడు, మే 26:** అన్నమయ్య జిల్లా మదనపల్లి రూరల్ మండలం వేంపల్లి గ్రామంలో గంగజాతర పండుగ రోజు చోటుచేసుకున్న ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. విచారణ పేరుతో ఇంటికి వచ్చిన పోలీసులు సాఫ్ట్వేర్ ఉద్యోగిపై దాడి చేయడమే కాకుండా, అడ్డుకున్న తల్లిదండ్రులపైనా దురుసుగా ప్రవర్తించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా మదనపల్లి రూరల్ సీఐ కళా వెంకటరమణ వ్యవహారశైలి ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. వేంపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు బెంగళూరులో సాఫ్ట్వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇటీవల గంగజాతర పండుగ సందర్భంగా స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో ఏదో కేసు విచారణ నిమిత్తం పోలీసులు అతని ఇంటికి వెళ్లినట్లు సమాచారం. అయితే విచారణ పేరుతో వచ్చిన సీఐ కళా వెంకటరమణ యువకుడిపై దురుసుగా ప్రవర్తించి, బూటుకాళ్లతో తన్నాడని బాధితుడు ఆరోపించాడు. ఇంట్లోనే ఈ ఘటన జరగడంతో కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. యువకుడిని రక్షించేందుకు ప్రయత్నించిన తల్లిదండ్రులపై కూడా పోలీసులు దాడి చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇంటిలోపలికి చొరబడి అవమానకరంగా ప్రవర్తించడంతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్య



క్తం చేశారు. పండుగ రోజు గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకోవడంతో వాతావరణం ఉద్రిక్తంగా మారింది. ఈ విషయం గ్రామంలో వేగంగా వ్యాపించడంతో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు వేంపల్లి క్రాస్ వద్దకు చేరుకుని రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. సీఐపై వెంటనే చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు ప్రజలను రక్షించాల్సింది పోయి ఇలా దౌర్జన్యానికి పాల్పడటం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ భాష ఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందజేసి సీఐ కళా వెంకటరమణను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ ఘటనను రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రి నారా లోకేశ్ దృష్టికి కూడా తీసుకెళ్తామని తెలిపారు. ప్రస్తుతం ఈ ఘటనపై గ్రామంలో తీవ్ర చర్చ కొనసాగుతుండగా, పోలీసు ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

# పసిబిడ్డలను కిరాతకంగా హతమార్చిన తల్లికి యావ జీవకారాగార శిక్ష

**రామకుప్పం – ఆంధ్రనాడు, మే 26:** అమ్మ లాలన తండ్రి ఓదార్పుతో అమాయకులైన పిల్లలు తల్లి పిలిచే పాటికి వచ్చి తల్లి వెచ్చని కౌగిలిలో తన్మయంతో ఉంటామని భావించారు కానీ ఆ తల్లి కర్కాసింగ తన కోర్కెలు తీర్చుకునేందుకు అడ్డు వస్తున్నారు అని భావించి వారిని అతికిరాతంగా చంపివేసి తల్లి అని పదానికి మాయని మచ్చ తెచ్చారు ఆ పిల్లల మరణ వేదనే ఆ తల్లికి ప్రస్తుతం న్యాయస్థానం యవజీవ శిక్ష విధించినది వివరాలు ఇలా ఉన్నాయి రామకుప్పం మండలం కవ్వంపల్లిలో 2017 సంవత్సరం పవిత్ర తన ఇద్దరు పిల్లలను అతికిరాతంగా హత్య చేసినది దానితో అప్పటి రామకుప్పం ఎస్సై సురేష్ బాబు కేసు నమోదు చేసి నారు దానితో మంగళవారం కేసు పూర్వపరాలు విచారించిన చిత్తూరు జిల్లా 9వఆదనపు జడ్జి శ్రీనివాసరావు పవిత్రకు యావ జీవ శిక్ష విధిస్తూ1000 రూపాయలు కట్టాలని లేనిచో అదనంగా



మరొక మూడు నెలలు శిక్ష అనుభవించాలని తీర్పు చెప్పారని రామకుప్పం ఎస్సై వెంకట మోహన్ పత్రిక విలేకరులకు తెలియజేశారు కవ్వంపల్లి చెందిన పవిత్ర వేమారెడ్డి తో వివాహమైనది వీరికి ఆరు సంవత్సరాలు మూడు సంవత్సరాలు వయసుగల ఇద్దరు పిల్లలు ఉన్నారు పవిత్ర అక్కడ డ్రైవర్ గా పనిచేస్తున్న వే మన్న తో అక్రమ సంబంధం పెట్టుకున్నది వీరు తరచూ కలుసుకునేవారు తమ వ్యక్తిగత జీవితానికి వీరిరువురు బిడ్డలు అడ్డు వస్తున్నారు అని భావించి అంగన్వాడిలో చదువుతున్న వీరిని పవిత్ర తీ సుకుని వచ్చి ఇంటిలో ఇరువురు బిడ్డలకు నైలాన్ తాడుతో బిగించి ఫ్యాన్ కి ఉరివేసి చంపేసింది తర్వాత ఏమీ తెలియకుండా వెళ్ళిపోయినది కొద్ది సమయం తర్వాత ఇంటికొచ్చిన భర్త వేమారెడ్డి ఇంటిలో బిడ్డలు విగత జీవులై పడి ఉండడం చూసి హృదయ విదారకంగా రోదించి నారు దాంతోపాటు ఆ గ్రామంలోని అందరూ ఈ ఘోరాన్ని చూసి అలమటించి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినారు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు 10 సంవత్సరాల తర్వాత కేసు జడ్జిమెంట్ వచ్చినది ఏది ఏమైనా పసిబిడ్డలను హతమార్చినందుకు న్యాయస్థానం గొప్ప శిక్ష విధించడం వల్ల పలువురు పోలీసులను న్యాయస్థానాన్ని అభినందిస్తున్నారు

# పల్లె సీమల్లో పసుపు పండుగ

**- ఆనందంలో తెలుగు తమ్ముళ్లు**

**- మహానాడు జయప్రదం చేయండి**

**- మండల తెలుగుదేశం పార్టీ నాయకులు**





**రామకుప్పం – ఆంధ్రనాడు, మే 26:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు నారా లోకేష్ పిలుపుమేరకు పల్లె సీమల్లో పసుపు పండుగ కార్యక్రమాలు చేయాలని రామకుప్పం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వెంకటరమణ మాజీ అధ్యక్షులు ఆనంద్ రెడ్డి ప్రధాన కార్యదర్శి కామ రాజు నాయక్ క్లస్టర్ ఇంచార్జ్ ఏ రవి రెడ్డి నాగభూషణం తెలిపారు మండల పరిధిలోని మూడు మరియు నాలుగు క్లస్టర్ విభాగాలకు సంబంధించి జూమ్మ్ మీటింగ్లు నిర్వహిస్తున్నట్టు తెలిపారు మూడవ క్లస్టర్ కు రామకుప్పం ఎం ఆర్ ఆర్ కళ్యాణమండపం నాలుగో క్లస్టర్ కి ఆనిగానూరు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు తెలుగుదేశం పార్టీలో ఉన్న గ్రామస్థాయి కార్యకర్త నుంచి పై స్థాయి వరకు ఉన్న నాయకులు మహిళలు అందరూ హాజరు కావాలన్నారు ప్రతి ఒక్కరూ విధిగా పసుపు చొక్కా ధరించి సభ్యత్వ ఐడి కార్డు ధరించి సమావేశంలో పాల్గొనాలన్నారు ఈ కార్యక్రమం పల్లసీమలో జరుగుతున్న మహానాడు ను తమ సొంత కార్యక్రమంలో పండుగలాగా చేయాలని వారు పిలుపునిచ్చారు

# డివైడర్ ఢీకొన్న ద్విచక్ర వాహనం.... మైనర్ బాలుడు మృతి



**తిరుపతి మే 26 (ఆంధ్రనాడు):** డివైడర్ "ఢీ " కొని మై నర్ బాలుడు మృతి చెందిన సంఘటన యూనివర్సిటీ పో లీస్ స్టేషన్ పరిధిలో జరిగిందని. ఎస్సై సుబ్బారెడ్డి మం గళవారం తెలిపారు ఎస్సై కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి తిరుపతి రూరల్ మండలం, అవిలాల పంచా యతీ, గాంధీ పురంకు చెందిన గోపీచంద్ (17) తిరుమ లలో కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మం గళవారం ఉదయం తిరుమల నుండి గాంధీపురం వైపు వెళ్తున్నాడు. రాళ్లపల్లి సర్కిల్ సమీపంలో ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించబోయి డివైడర్ను ఢీకొన్నాడు. తలకు బలమైన గాయం కా వడంతో గోపీచంద్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం రుయా హా స్పిటల్‌కి తరలించారు.మృతుడు తల్లి శాంతిప్రియ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# కుప్పకూలిన భక్తురాలు



**తిరుపతి, మే 26, (ఆంధ్రనాడు):** స్థానిక తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం మూడో గేటు వద్ద మంగళవారం మృతురాలు విజయవాడ భవానిపురం చెందిన కృష్ణవేణి 28 సంవత్సరాలు కుటుంబ సభ్యులతో కలిసి పద్మావతి అమ్మవారిని దర్శించుకోవడానికి రావడం జరిగింది. ఉన్నట్లుండి ఉప్పు కూలిన మహిళను ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందడం జరిగింది. అయితే వాటి దెబ్బ తగిలి మృతి చెందిందా గుండుపడుతూ మృతి చెందిందా అనేది నిర్ధారించాల్సి ఉంది భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తిరుచానూరు ఎస్సై సుమతి తెలియజేశారు. పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించడం జరిగిందని పేర్కొన్నారు.

# ఐపీఎల్-2026 ఫైనల్లోకి దూసుకెళ్లిన ఆర్సీబీ...

# గుజరాత్‌కు మరో చాన్స్

- క్వాలిఫయర్-1లో గుజరాత్‌పై ఆర్సీబీ 92 పరుగుల భారీ విజయం
- ఐపీఎల్ 2026 ఫైనల్‌కు నేరుగా అర్హత సాధించిన బెంగళూరు
- 33 బంతుల్లో 93 పరుగులు చేసి కెప్టెన్ రజత్ పటీదార్ విధ్వంసం
- గుజరాత్ తరఫున రాహుల్ తెవాటియా ఒంటరి పోరాటం
- ఓడినా గుజరాత్ టైటాన్స్‌కు ఫైనల్ చేరేందుకు మరో అవకాశం



డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఐపీఎల్ 2026 సీజన్‌లో నేరుగా ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన క్వాలిఫయర్-1 మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌ను 92 పరుగుల భారీ తేడాతో చిత్తుగా ఓడించి టైటిల్ సమరానికి సిద్ధమైంది. కెప్టెన్ రజత్ పటీదార్ ఆడిన విధ్వంసకర ఇన్నింగ్స్ ఆర్సీబీ విజయంలో కీలకపాత్ర పోషించింది. మరోవైపు, ఈ మ్యాచ్‌లో ఓటమి పాలైనప్పటికీ గుజరాత్ టైటాన్స్‌కు ఫైనల్ చేరేందుకు మరో అవకాశం మిగిలి ఉంది. ఎలిమినేటర్ మ్యాచ్ విజేతతో ఆ జట్టు క్వాలిఫయర్-2లో తలపడనుంది.

ధర్మశాల వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన గుజరాత్ టైటాన్స్ బౌలింగ్ ఎంచుకోగా, ఆర్సీబీ బ్యాటర్లు పరుగుల వరద పారించారు. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 254 పరుగుల భారీ స్కోరు సాధించారు. వెంకటేశ్ అయ్యర్ (19) మెరుపు ఆరంభాన్ని ఇవ్వగా, విరాట్ కోహ్లీ (43), దేవదత్ పడిక్కల్ (30) కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే వీరిద్దరిని ఒకే ఓవర్లో పెవిలియన్ చేర్చి హోల్డర్ గుజరాత్‌కు కాస్త ఊరటనిచ్చాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ రజత్ పాటిదార్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 33 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్సర్లతో అజేయంగా 93 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. కృనాల్ పాండ్య (43) కూడా రాణించడంతో ఆర్సీబీ భారీ స్కోరు చేసింది.

అనంతరం 255 పరుగుల కొండంత లక్ష్య ఛేదనలో గుజరాత్ టైటాన్స్ ఆరంభంలోనే తడబడింది. సాయి సుదర్శన్ (14), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (2) త్వరగా ఔటయ్యారు. జోస్ బట్లర్ (29) వేగంగా ఆడే ప్రయత్నం చేసినా ఎక్కువసేపు నిలవలేదు. ఒక దశలో 51 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి గుజరాత్ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ సమయంలో రాహుల్ తెవాటియా (68) ఒంటరి పోరాటం చేశాడు. 43 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో గుజరాత్ పరువు నిలిపే ప్రయత్నం చేశాడు. కానీ అతనికి ఇతర బ్యాటర్ల నుంచి సహకారం అందలేదు.

ఆర్సీబీ బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో గుజరాత్ 19.3 ఓవర్లలో 162 పరుగులకే ఆలౌట్ అయింది. ఆర్సీబీ బౌలర్లలో జాకబ్ డఫీ 3 వికెట్లు పడగొట్టగా.. భువనేశ్వర్ కుమార్, కృనాల్ పాండ్య, రసిఖ్ సలామ్ దార్ తలా రెండు వికెట్లు తీశారు.

రేపు (మే 27) సన్ రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జరగనుంది. ఇందులో గెలిచిన జట్టుతో మే 29న క్వాలిఫయర్-2లో గుజరాత్ టైటాన్స్ తలపడనుంది. ఈ మ్యాచ్ లో గెలిచిన జట్టు ఫైనల్ చేరుతుంది.

## సబలెంక, ముఛోవా శుభారంభం

### - ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్ స్లామ్ టోర్నీ



**పారిస్:** ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్ స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ లో టాప్ సీడ్, బెలారస్ కు చెందిన అర్యానా సబలెంకా, చెక్ రిపబ్లిక్ కు చెందిన 10వ సీడ్ ముఛోవా శుభారంభం చేశారు. మంగళవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో సబలెంక 6-4, 6-2తో స్పెయిన్‌కు చెందిన అన్ సీడెడ్ క్రీడాకారిణి బౌజన్ ను చిత్తుచేయగా.. ముఛోవా 7-5, 6-2తో వరుససెట్లలో రష్యాకు చెందిన జఖరోవా ను ఓడించింది. ఇతర పోటీల్లో 12వ సీడ్ నొస్కోవా(చెక్) 5-7, 6-7(3-7)తో అన్ సీడెడ్ సక్కారి(గ్రీక్) చేతిలో అనూహ్యంగా ఓటమిపాలైంది. ఇక 10వ సీడ్ లీగ(అమెరికా) 6-4, 6-2తో చైనాకు చెందిన జంగ్ ను, 17వ సీడ్ జోవిక్(అమెరికా) 6-4, 6-2తో ఇలా(ఫిలిప్పీన్స్)ను ఓడించి రెండోరౌండ్‌కు చేరారు.

**మెద్వదెవ్ ఔట్..**

6వ సీడ్, రష్యాకు చెందిన డానియేల్ మెద్వదేవ్ అనూహ్యంగా తొలిరౌండ్ లోనే ఓటమిపాలయ్యాడు. మంగళవారం జరిగిన ఐదుసెట్ల హోరాహోరీ పోరులో మెద్వదెవ్ 2-6, 6-1, 1-6, 6-1, 4-6తో అన్ సీడెడ్ వాల్టన్(ఆస్ట్రేలియా) చేతిలో ఓడాడు. ఇక సిట్సిపాస్(గ్రీక్) 6-2, 3-0తో ఆధిక్యతలో ఉన్న దశలో ముల్లర్(ఫ్రాన్స్) గాయంతో మైదానాన్ని వీడాడు. దీంతో సిట్సిపాస్ రెండోరౌండ్ కు చేరాడు. అలాగే 20 సీడ్ నొర్రీ(బ్రిటన్) కూడా 6-7(7-9), 0-2తో అన్ సీడెడ్ ఆడాల్సో(పరాగ్వే)పై వెనుకబడి ఉన్న దశలో మ్యాచ్ నుంచి వైదొలిగాడు.

## చరిత్ర సృష్టించిన కోహ్లి విరాట్ కోహ్లి



ఐపీఎల్‌లో వరుసగా నాలుగు సీజన్లలో 600కుపైగా పరుగులు చేసిన తొలి బ్యాటర్‌గా కోహ్లి చరిత్ర సృష్టించాడు. 2023, 2024, 2025 సీజన్లలో విరాట్ 600o రన్స్ చేశాడు. ఇప్పుడు ఈ ఏడాది సీజన్‌లో కూడా కోహ్లి 50.00 సగటు, 164.38 స్ట్రైక్‌రేట్‌తో600పరుగులు చేశాడు. గతంలో క్రిస్ గేల్ (2011, 2012, 2013), డేవిడ్ వార్నర్ (2016, 2017, 2019), కేఎల్ రాహుల్ (2020, 2021, 2022) వరుసగా మూడు సార్లు ఈ ఫీట్ అందుకునరుగులు కానీ వరుసగా నాలుగు సీజన్లలో కోహ్లి మినహా మిగితా ఎవరూ ఈ ఘనత సాధించలేకపోయారు. అదేవిధంగా ఐపీఎల్ ప్లేఆఫ్స్ మ్యాచ్‌లు ఆడిన జాబితాలో కోహ్లి నాలుగో స్థానానికి ఎగబాకాడు.

# ‘యల్లమ్మ’కు అందుకే ఓకే చెప్పా..

# దేవి శ్రీ ప్రసాద్ స్పెషల్ వీడియో ఇదిగో!

- హీరోగా తన అరంగేట్రంపై స్పందించిన డీఎస్పీ
- ‘యల్లమ్మ’ సినిమాకు ఓకే చెప్పడానికి కారణం ఇదేనంటూ వెల్లడి
- తన తండ్రి స్వగ్రామం వేదురుపాకతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న దేవి
- చిన్నప్పటి జానపద కళలే స్ఫూర్తినిచ్చాయన్న సంగీత దర్శకుడు
- వేణు యెల్దండి దర్శకత్వంలో దిల్ రాజు నిర్మాణంలో ఈ చిత్రం

ప్రముఖ సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ నటుడిగా అరంగేట్రం చేయనున్న సంగతి తెలిసిందే. వేణు యెల్దండి దర్శకత్వంలో ‘యల్లమ్మ’ అనే చిత్రంలో ఆయన హీరోగా నటిస్తున్నారు. అయితే, ఒక అగ్ర సంగీత దర్శకుడిగా ఉండి నటన వైపు ఎందుకు అడుగులు వేశారనే దానిపై డీఎస్పీ స్వయంగా స్పందించారు. తను ఈ సినిమా చేయడానికి అంగీకరించడం వెనుక ఉన్న అసలు కారణాన్ని మంగళవారం వెల్లడించారు.
ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ ప్రత్యేక వీడియోను పంచుకున్నారు. తన తండ్రి స్వగ్రామమైన వెదురుపాకలో తాను పర్యటించిన దృశ్యాలను అందులో చూపించారు. “చిన్నప్పటి నుంచి జానపద కళల పట్ల నాలో ఆసక్తిని నింపిన అద్భుతమైన సంప్రదాయాలు, సంస్కృతి ఇదే. మా ఊరిలో జరిగే ‘అమ్మోరు జాతర’ వేడుకలు నాపై తీవ్ర ప్రభావం చూపాయి. ‘యల్లమ్మ’కు నేను ఎందుకు ఓకే చెప్పానో ఇదే కారణం” అని డీఎస్పీ పోస్ట్‌లో పేర్కొన్నారు.

చిన్నప్పుడు తన తండ్రి తమను చెన్నై నుంచి తరచూ ఈ గ్రామానికి తీసుకొచ్చేవారని, ఇక్కడి ప్రకృతి స్వచ్ఛతను ఆస్వాదించేలా చేశారని డీఎస్పీ గుర్తుచేసుకున్నారు. “మా మూలాలతో, మా వాళ్లతో సంబంధం కొనసాగేందుకు మేం ఇక్కడ అందమైన ఇల్లు కట్టుకున్నాం. సంస్కృతి, జానపద కళలు, దైవత్వం వంటి గొప్ప విషయాలను ఈ ఊరే నాకు నేర్పింది. అదే నాకు స్ఫూర్తినిచ్చింది” అని వీడియోలో వివరించారు. ఈ అనుబంధం కారణంగానే ‘యల్లమ్మ’ కథకు వెంటనే కనెక్ట్ అయినట్లు తెలిపారు.
దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వేణు యెల్దండి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా కోసం దర్శకుడు వేణు, డీఎస్పీ మధ్య తొలి సమావేశం ఏకంగా 8 గంటల పాటు సాగడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఈ చిత్రంలో డీఎస్పీ ‘పర్శి’ అనే పాత్రలో కనిపించనుండగా, సంగీతాన్ని కూడా ఆయనే అందిస్తున్నారు.





## కొలిక్కి రాని పర్సంటేజి

తెలుగు చిత్ర పరిశ్రమలో ‘పర్సెంటేజ్’ వివాదం ఇంకా కొనసాగుతోంది. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రెంట్ విధానానికి బదులుగా పర్సెంటేజ్ విధానం అమలు చేయాలని ఎగ్జిబిటర్లు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం మల్టీప్లెక్స్‌లలో వసూళ్లలో శాతం చెల్లిస్తుండగా, సింగిల్ స్క్రీన్‌లకు మాత్రం అద్దె విధానం కొనసాగుతోంది. అందరికీ ఒకే విధానం ఉండాలనేది ఎగ్జిబిటర్ల వాదన. ఇదేదో ‘పెద్ది’ సినిమాను అడ్డుకునేందుకు చేస్తున్న పోరాటం కాదని, తమ మనుగడ కోసమేనని ఎగ్జిబిటర్లు, నిర్మాతలు చెబుతున్నారు. ఇప్పటికే ఈ వివాదంపై పరిశ్రమ పెద్దలు కమిటీ ఏర్పాటు చేశారు. అయితే నివేదిక ఆలస్యమైతే సినిమాల విడుదలపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి. జూన్ 4న రామ్‌చరణ్ నటించిన ‘పెద్ది’ విడుదల కానున్న నేపథ్యంలో తాజాగా చిరంజీవి నివాసంలో సమావేశం జరిగింది. దిల్‌రాజు, సురేశ్‌బాబు, అల్లు అరవింద్, కేఎల్ నారాయణ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ తీసుకునే నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని చిరంజీవి సూచించారు. జూన్ 30లోపు కమిటీ అన్ని అంశాలు పరిశీలించి ప్రొడ్యూసర్స్, డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్లకు న్యాయం జరిగేలా ‘పర్సెంటేజ్ మోడల్’పై ప్రతిపాదనలు చేస్తుందనే నమ్మకం వ్యక్తం చేశారు. తెలుగు చిత్ర పరిశ్రమలో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న ఈ వివాదానికి ఆమోదయోగ్యమైన పరిష్కారం దొరుకుతుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## మా ఇంటి బంగారం

### - యక్షన్ సీన్స్ లో అదరగొట్టిన సమంత




హైదరాబాద్ : ప్రముఖ నటి సమంత తాజాగా నటించిన చిత్రం ‘మా ఇంటి బంగారం–. ఈ సినిమా జూన్ 19న సినిమా విడుదల కానుంది.
ఈనేపథ్యంలో మూవీ మేకర్స్ ట్రైలర్ని విడుదల చేశారు. ఈ సినిమాలో చీరకట్టులోనే సమంత యాక్షన్ సీన్స్ లో అదరగొట్టింది. ఈ మూవీ నందిని రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కింది. రాజ్ నిడిమోరు కథనాన్ని అందించారు.

ANDHRANADU
TELUGU DAILY

బుధవారం
27.05.2026

తిరుపతి – చిత్తూరు
అన్నమయ్య– అనంతపురం
ఆంధ్రనాడు

# శేషాచలంలో 'ఎర్ర బంగారం' సింగారం

**- కనువిందు చేస్తున్న అరుదైన ఎర్రచందనం పూల సోయగం!**

**తిరుపతి/కడప –ఆంధ్రనాడు, మే 26:** ప్రపంచంలోనే అత్యంత అరుదైన, ఖరీదైన వృక్ష సంపదగా పేరుగాంచిన మన శేషాచల 'ఎర్ర బంగారం' (ఎర్రచందనం) ఇప్పుడు సరికొత్త అందాలతో మురిపిస్తోంది. ఫాబేసి కుటుంబానికి చెందిన, 'టెరోకార్పస్ శాంటాలినస్' గ్రీవతీశీఝతీజూబం ఖఅ–ఖశ్రీఱఅబం) అనే శాస్త్రీయ నామమున్న ఈ అరుదైన మొక్కలు కేవలం మన శేషాచల అడవుల్లో మాత్రమే లభిస్తాయి. వేసవి ప్రారంభంతో ఈ వృక్షాలు ఆకర్షణీయమైన పసుపు రంగు పూలు, ఎర్రని చివుళ్లతో మెరిసిపోతూ అడవికి కొత్త కళను తెచ్చాయి. దూరం నుంచి చూస్తే పచ్చని కొండల మధ్య ఈ రంగుల సమ్మేళనం ఒక అద్భుత పెయింటింగ్‌లా కనువిందు చేస్తోంది. ఈ చెట్ల కలపతో పాటు ప్రస్తుత పూత, కాయలకు అద్భుత ఔషధ గుణాలు ఉంటాయని నిపుణులు చెబుతుండగా.. అంతర్జాతీయ మార్కెట్‌లో కోట్లు పలికే ఈ 'రక్త చందనం' విత్తనాల సేకరణకు, జాతి పునరుత్పత్తికి ఈ సమయం అత్యంత కీలకమని పరిశోధనలు చెబుతున్నాయి.

స్మగ్లర్ల కన్ను పడకుండా ప్రభుత్వం ఈ శేషాచల సిరిపై కట్టుదిట్టమైన నిఘా ఉంచినప్పటికీ, ప్రకృతి సిద్ధంగా సాక్షాత్కరిస్తున్న ఈ వృక్ష సౌందర్యం ఇప్పుడు పర్యావరణ ప్రేమికులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఎస్ వీ యు వృక్ష శాస్త్ర పరిశోధకుడు డాక్టర్ మిట్ట మహేంద్ర నాథ్ తన కెమెరా లో బంధించిన ఫోటోలు మీకోసం






Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSS Complex, Air Bypass Road, Tirupati Town, Tirupati District, A.P., Published at AKSHARA PUBLICATIONS, Tirupati, Editor : M.Hari Babu , Cell : 9490400684, RNI: 2009/28733